# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 12-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:36 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

ఇమ్మహి సాంకేతికతకు
తమ్మికనులవాడు తనదు దయ జత గూర్చన్
"యెమ్మెస్టీ టెక్నాలజీ"
ఉమ్మడి గా సేవలొసగు నుర్వి జనులకున్ !!


(యెమ్మెస్టీ టెక్నాలజీ కంపెనీ హైదరాబాద్ లో రెండున్నర లక్షల చదరపు అడుగుల్లో నెలకొల్పబడి ప్రపంచం మొత్తానికీ సాంకేతిక సేవలు అందిస్తున్నది. దీని వలన హైదరాబాద్ కు ఉద్యోగోపాధి అవకాశాలు పెరిగాయి. జనులకు మేలు జరుగుతున్నది.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

నిషేధిత భూముల
నీలి పడగ నీడలు
అధికారుల అవినీతికి
అవుతున్నవి మేడలు.
నాడు మొలక ఎత్తినా
నేడు విస్తరిస్తుంది
సర్కారు మెడను చుట్టి
చెడ్డపేరు తెస్తుంది



-వేల్పుల నారాయణ
9440433475

# ఉగ్రవాదంపై నిరంతరం పోరాడుతున్నాం: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11:అమెరికాలో 9/11 దాడులు జరిగి 25 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా ఉగ్రబాధితుల కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. నాటి దాడి తరువాత బాధితుల జీవితాలు శాశ్వతంగా మారిపోయాయని అన్నారు. ఉగ్రవాదంపై పోరుకు భారత్ కట్టుబడి ఉందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అసంఖ్యాక అమాయకులను ఉగ్రవాదం బలితీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీమాంతర ఉగ్రవాదానికి భారత్ కూడా బాధిత దేశమని అన్నారు. ఉగ్రవాదంతో భారత్ దశాబ్దాలుగా పోరాడుతోందని చెప్పారు.

ఉగ్రవాదం కూడా కొత్త రూపాలను సంతరించుకుంటోందని ప్రధాని మోదీ తెలిపారు. భారత్ మాత్రం చెదరని పట్టుదలతో ఈ పోరులో ముందుకు సాగుతోందని చెప్పారు. ఈ పీడ వదిలించేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని చెప్పారు. 2014 నాటి 9/11 స్మారకం సందర్శనకు సంబంధించి ఫొటోలను కూడా ప్రధాని ఎక్స్ వేదికగా షేర్ చేశారు.

2001 సెప్టెంబర్ 11న అల్ ఖైదా ఉగ్రవాదులు అమెరికాపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. రెండు విమానాలతో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను కూల్చేశారు. పెంటగాన్‌పై కూడా ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ దాడుల్లో 2,977 మంది మరణించారు. ఈ దారుణం జరిగి 25 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో అమెరికా వ్యాప్తంగా సంస్మరణ కార్యక్రమాలు జరిగాయి.

# సోలార్ విద్యుత్‌పై ఫోకస్

**15 వేల మెగావాట్ల నుంచి 19,543 మెగావాట్లకు పెరుగుదల**
**విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టు ప్రణాళికలు**
**'ఎంప్లాయ్ ఫ్రెండ్లీ' ప్రభుత్వం**
**విద్యుత్ డిమాండ్ దూసుకెళ్తోంది!**
**పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థల బలోపేతం**
**సౌర, ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి: భట్టి విక్రమార్క**



హైదరాబాద్, సెప్టెంబర్ 11:తెలంగాణలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2023 డిసెంబరు నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 15 వేల మెగావాట్లు ఉండగా.. ఈ నెల 9వ తేదీ నాటికి అది 19,543 మెగావాట్లకు చేరిందని అసెంబ్లీలో వెల్లడించారు.

రాష్ట్రంలో పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరించడం, ప్రజల వినియోగ శక్తి పెరగడం తదితర కారణాలతో విద్యుత్ అవసరం వేగంగా పెరుగుతోందని భట్టి పేర్కొన్నారు. భవిష్యత్‌లో పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలను సిద్ధం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు.

## సౌర విద్యుత్‌పై ఫోకస్

విద్యుత్ అవసరాలను తీర్చేందుకు సంప్రదాయేతర ఇంధన వనరులను విస్తృతంగా వినియోగించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సౌర విద్యుత్, ఫ్లోటింగ్ సోలార్ తదితర మార్గాలను ప్రోత్సహించేందుకు విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయని చెప్పారు. అధ్యయనం పూర్తయిన అనంతరం దీనిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేస్తుందని వెల్లడించారు.ప్రజా ప్రభుత్వంలో ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఉద్యోగులకు క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు అందిస్తున్నామని చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ విధానం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## 27 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్

రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు విద్యార్థుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు.

# వీఆర్‌ఏలకు న్యాయం చేస్తాం

**61 ఏళ్లు నిండిన వీఆర్‌ఏల పునరుద్ధరణపై పరిశీలన**
**సాంకేతిక చిక్కులను అధిగమించి త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటాం**
**గత ప్రభుత్వం వీఆర్‌ఏ, వీఆర్‌ఓ వ్యవస్థలను రద్దు చేసి రెవెన్యూ రంగాన్ని దెబ్బతీసింది-పొంగులేటి**

హైదరాబాద్, సెప్టెంబర్ 11: గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు వీఆర్‌ఏలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అసెంబ్లీలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తావించారు. వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అర్ధరాత్రి నిర్ణయాలతో వీఆర్‌ఏ, వీఆర్‌ఓ వ్యవస్థలను రద్దు చేసి రెవెన్యూ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసిందని మంత్రి ఆరోపించారు. దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో భూముల పరిరక్షణతో పాటు ప్రజలకు సేవలందించిన రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు.

**61 ఏళ్లు నిండిన వీఆర్‌ఏలపై దృష్టి**

61 ఏళ్లు నిండిన వీఆర్‌ఏల పునరుద్ధరణ అంశంపై ప్రస్తుతం సాంకేతికపరమైన చిక్కులను పరిశీలిస్తున్నామని పొంగులేటి తెలిపారు. అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. వీఆర్‌ఏలకు న్యాయం చేయడంలో ప్రభుత్వం వంద శాతం కట్టుబడి ఉందని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ సేవలు ప్రజలకు మరింత అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# బిహార్‌లో విషాదం.. నీటి గుంతల్లో పడి ఐదుగురు మృతి

**మృతుల్లో నలుగురు చిన్నారులు**
**పొలాలను చూసేందుకు వెళ్లి ప్రమాదం..**
**ఒకరిని కాపాడే ప్రయత్నంలో మరికొందరు మృత్యువాత**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: బిహార్‌లో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో విషాద ఘటన చోటుచేసుకుంది. భాగల్పూర్ జిల్లాలోని కోయిలీ ఖుటాహా గ్రామంలో నీటితో నిండిన లోతైన గుంతల్లో పడి నలుగురు చిన్నారులు, ఓ మహిళ మృతి చెందారు. గ్రామానికి సమీపంలోని పొలాలను చూసేందుకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానిక అధికారులు, గ్రామస్థులు తెలిపారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఒకే కుటుంబానికి చెందినవారు కాగా.. మరో చిన్నారి కూలీ కుటుంబానికి చెందినవాడని గ్రామ పంచాయతీ ముఖియా దేవేంద్ర కుమార్ తెలిపారు. పొలాలకు వెళ్లే రహదారికి ఇరువైపులా లోతైన గుంతలు ఉండటంతో అవి వర్షపు నీటితో నిండిపోయాయి. ఈ క్రమంలో ఓ చిన్నారి ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడిపోయాడు. అతడిని కాపాడేందుకు ప్రయత్నించిన సమయంలో మిగిలిన వారు కూడా నీటిలో పడిపోయినట్లు అధికారులు తెలిపారు. మృతుల్లో ఇద్దరు బాలురు, ఓ బాలిక ఒకే కుటుంబానికి చెందినవారని.. మరో చిన్నారి కార్మికుడి కుటుంబానికి చెందినవాడని వెల్లడించారు.

ప్రమాదంలో మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని స్థానికుడు రాజేశ్ కుమార్ తెలిపారు. మృతులంతా పొలాలను పరిశీలించేందుకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు చెప్పారు. గుంతలు లోతుగా ఉండటంతో పాటు బాధితుల్లో ఎవరికీ ఈత రాకపోవడం ప్రమాదం తీవ్రతకు కారణమైందని గ్రామస్థులు తెలిపారు. బిహార్‌లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పలు ప్రాంతాల్లో వరద పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పొలాలు, రహదారుల పరిసరాల్లో నీరు నిలిచిపోతోంది. ఈ నేపథ్యంలో నీటితో నిండిన గుంతల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# సెప్టెంబర్ 17 నుంచి సేవా సంకల్ప్ అభియాన్ ప్రారంభం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



హైదరాబాద్, సెప్టెంబర్ 11: తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని రాంచందర్‌రావు చెప్పారు.

ఈ మేరకు సెప్టెంబర్ 17న 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి ఇంటిలో దీపాలు వెలిగించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. మోదీ పాలనలో జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలను బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించి సంక్షేమ ప్రయోజనాలను నేరుగా అందిస్తున్నామని ఆయన వివరించారు. యూపీఐ, డిజిటల్ చెల్లింపుల విస్తరణతో భారత్ ప్రపంచ డిజిటల్ పేమెంట్ రంగంలో కీలక స్థానాన్ని సాధించిందన్నారు.పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల ద్వారా చేతివృత్తిదారులు, చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని రాంచందర్‌రావు తెలిపారు. ఈ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు. అభియాన్‌లో భాగంగా మేరే సప్నో కా భారత్, సేవా కీ కహానీ, సేవా జ్యోతి కలశ్ యాత్ర, సుశాసన్ సేవా సంవాద్ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. సేవ, సుశాసనం, ప్రజా సంక్షేమం అనే స్ఫూర్తితో మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే లక్ష్యమని రాంచందర్‌రావు పేర్కొన్నారు.

# దేశవ్యాప్తంగా నిలిచిన బ్యాంకింగ్ సేవలు.. పెండింగ్‌లో 4 లక్షల కోట్ల విలువైన చెక్కులు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11:దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలుగనిలిచిపోయాయి. దీంతో కోట్లాది మంది కస్టమర్లు ఇబ్బందిపడుతున్నారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్ల ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. వారానికి 5 రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేయాలని కోరుతూ బ్యాంకింగ్ రంగ ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. బ్రాంచ్ ఆపరేషన్స్, క్యాష్ డిపాజిట్స్, విత్రడాల్స్, చెక్కు క్లియరెన్సులు నిలిచిపోయాయి. ఉద్యోగులతో పాటు ఆఫీసర్లు కూడా ఈ సమ్మెలో పాల్గొన్నారు. చాలా వరకు పబ్లిక్ రంగ బ్యాంకను మూసివేశారు. యూఎఫ్‌బీయూ గ్రూపులో మొత్తం 9 ఉద్యోగ సంఘాలు ఉన్నాయి, ఇక పబ్లిక్ రంగ బ్యాంకుల్లో సుమారు 8 లక్షల మంది వర్కర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

బ్యాంకుల మూసివేతతో ఎక్కడికక్కడ చెక్కులు నిలిచిపోయాయి. సుమారు 4 లక్షల కోట్ల మేర విలువైన చెక్కులను పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. క్యాష్ ట్రాన్సాక్షన్స్, బిల్ ట్రేడింగ్, బిల్ డిస్కౌంట్ , ట్రేడ అంశాల్లో లావాదేవీలు స్తంభించాయి. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం మాట్లాడుతూ అన్ని పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లోని ట్రెజరీ ఆపరేషన్స్ నిలిపివేసినట్లు చెప్పారు మధ్య ప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఇప్పటికే ఏటీఎంల్లో నగదు నిండుకున్నది. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీ, యాక్సిస్ లాంటి బ్యాంకుల్లో ఇవాళ సేవలు కొనసాగాయి. ఆ బ్యాంకుల ఉద్యోగులు ఏ సంఘంలో లేరు. డిజిటల్ బ్యాంకింగ్ సర్వీసులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐలు అభ్యంతరం లేకుండా పనిచేస్తున్నాయి.నెలలో ప్రతి శనివారం కూడా హాలీడే ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సోమవారం నుంచి శుక్రవారం వరకు పని సమయాన్ని అదనంగా 40 నిమిషాలు పెంచాలని, ప్రతి శనివారాన్ని హాలీడేగా ప్రకటించాలని కోరుతూ 2023 డిసెంబంలో అధికా రులకు అభ్యర్థన సమర్పించినట్లు ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫిడరేషన్ జనరల్ సెక్రటరీ రూపమ్ రాయ్ తెలిపారు.

# ఫిల్టర్ బెడ్ వద్ద రోడ్డు పనులు ప్రారంభం

ఖమ్మం, సెప్టెంబర్ 11:'సివిల్ అధికారులు స్పందించి ఉంటే కార్మికుడి ప్రాణం దక్కేదా' అంటూ నమస్తే తెలంగాణ ఆన్‌లైన్‌లో ప్రచురితమైన కథనానికి సింగరేణి కొత్తగూడెం ఏరియా సివిల్ అధికారులు స్పందించారు. ఈ నెల 6న రాత్రి విధులకు వస్తున్న రుద్రంపూర్ సివిల్ డిపార్ట్‌మెంట్ పంప్ ఆపరేటర్ ఎస్. కోటేశ్వరరావు కారు ఢీకొని మృతి చెందిన నేపథ్యంలో ఈ కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన యాజమాన్యం ఫిల్టర్ బెడ్ వద్ద రోడ్డు పనులను వెంటనే ప్రారంభించింది. పనుల ప్రారంభంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ పనులు సకాలంలో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# లారీని ఢీకొట్టిన వ్యాన్.. మహిళలు, పిల్లలతో సహా 9 మంది మృతి



ముంబై, సెప్టెంబర్ 11: వేగంగా ప్రయాణించిన ఒక వ్యాన్, పెట్రోల్ బంకు నుంచి బయటకు వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యాన్‌లో ఉన్నవారిలో ఆరుగురు మహిళలు, ముగ్గురు పిల్లలతో సహా 9 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. గ మహారాష్ట్రలోని భండారా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున నాగ్‌పూర్-రాయ్‌పూర్ జాతీయ రహదారిలో ఉన్న పింపల్‌గావ్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఉన్న పెట్రోల్ బంకు నుంచి హైవేపైకి వస్తున్న ఒక లారీని అతివేగంతో వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ఎనిమిది మంది అక్కడికక్కడే మరణించగా, చికిత్స పొందుతూ మరొకరు చనిపోయారు. 9 మంది మృతుల్లో ఆరుగురు మహిళలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు.కాగా, ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం సకోలి సబ్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. మరణించిన వారి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మరోవైపు హైవే సమీపంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. ప్రమాదానికి కొద్దిసేపటి ముందు బొలెరో వాహనం అతివేగంగా ప్రయాణించినట్లు ఫుటేజ్‌లో కనిపించింది. లారీని ఢీకొట్టే ముందు వ్యాన్ డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.




# 'ప్రథమ చికిత్స' పట్ల అవగాహన కలిగి ఉండలేమా !

## (12 సెప్టెంబర్ "ప్రపంచ ప్రథమ చికిత్స దినం" సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల ప్రజలు పలు రకాలైన ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు వంటి దురదృష్టకర ఘటనల కారణంగా తక్షణమే వైద్య సహాయం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి తక్షణమే మనం చేయగలిగే చిన్న చిన్న ఉపశమన చర్యలను 'ప్రథమ చికిత్స (ఫస్ట్ ఏయిడ్)" అని పిలుస్తున్నాం. ప్రమాదం జరిగిన ప్రదేశానికి సమీపాన వైద్యులు అందుబాటులో ఉండకపోవచ్చు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని సమీప ఆసుపత్రి లేదా వైద్యుల వద్దకు చేర్చడానికి కొంత సమయం పట్టవచ్చు. గాయపడిన వ్యక్తిని వైద్యుని వద్దకు చేర్చుతూనే, ధైర్యాన్ని నూరి పోస్తూ తమకు అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించి, ఉపశమన చర్యలను చేపట్టడం, పరిస్థితి విషమించకుండా చూసుకోవడం, ప్రాణాపాయం తప్పించడం అనే ప్రథమ చికిత్స పట్ల ప్రతి ఒక్కరు కొంతమేరకు అవగాహన కల్పించడానికి ప్రతి ఏట సెప్టెంబర్ రెండవ శనివారం, అనగా 12 సెప్టెంబర్ 2026 రోజున ప్రపంచ దేశాలు "ప్రపంచ ప్రథమ చికిత్స దినం" పాటించడం 2000ల నుంచి ఆనవాయితీగా మారింది. ఘటనాస్థలానికి చేరిన సాధారణ పౌరులు చేయగలిగే ప్రథమ చికిత్సను సకాలంలో, సరైన పద్ధతిలో అందించడం ద్వారా వ్యక్తి ప్రాణాలను సహితం కాపాడే అవకాశాన్ని తీసుకోవడానికి ప్రతి ఒక్కరు ప్రథమ చికిత్స మౌళిక సూత్రాలను తెలుసుకొని ఉండాలని ప్రచారం చేయడం జరుగుతోంది.

### ప్రపంచ ప్రథమ చికిత్స దినం:

1858లో జరిగిన ఘర్షణ పోరాటంలో గాయపడి ప్రాణాపాయ అంచున నిలిచిన సామాన్యులను స్వచ్ఛందంగా కాపాడటానికి హెన్రీ డ్యునాంట్ వెంటనే స్పందించి సత్వరమే ప్రథమ చికిత్స సదుపాయాలను కల్పించి అనేకుల ప్రాణాలను కాపాడడం జరిగింది. రెడ్‌క్రాస్ అండ్ క్రిసెంట్ సొసైటీ చొరవతో ప్రారంభంపైన ప్రథమ చికిత్స విధానం ద్వారా నేడు ప్రాణ నష్టాలను తగ్గించడం జరుగుతోంది. రోడ్డు లేదా రైలు ప్రమాదాలు, పాము/తేలు/కుక్క కాటు, వంటింటి కత్తి తెగడం, అగ్ని ప్రమాదాలు, ముక్కు/చెవులు/కంటిలో ఇతర వస్తువులు చేరడం, ఎముకలు విరగడం, రక్తస్రావా కలగడం లాంటి అనేక సందర్భాల్లో ఆ వ్యక్తికి ధైర్యం ఇస్తూనే రక్తస్రావాన్ని తగ్గించడం, టించర్ అయేడిన్ ప్రయోగించడం, బ్యాండేజ్‌లు వేయడం లాంటి ప్రథమ చికిత్స చర్యలకు పూనుకోవాలి. ప్రథమ చికిత్స ఇతివృత్తంగా "వలసదారుల సందర్భాల్లో ప్రథమ చికిత్స (ఫస్ట్ ఏయిడ్ ఇన్ మైగ్రేషన్ కాన్‌టెక్స్ట్) "ను తీసుకోవడం జరిగింది. ప్రతి బస్సు, రైలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రథమ చికిత్స బాక్సులు అందుబాటులో ఉండడం తప్పనిసరి. ప్రతి ప్రథమ చికిత్స బాక్సులో స్టెరిలైజ్డ్ కాటన్, బ్యాండేజ్ మెటీరియల్, టించర్ ఐయోడిన్, సీజర్ లాంటి అత్యవసర వస్తువులు ఉంటాయి. ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని సత్వరమే వైద్యుని వద్దకు చేర్చుతూనే లేదా ప్రయత్నాలు కొనసాగిస్తూనే, సురక్షిత ప్రాంతానికి తరలించడం, గాలి తగిలే విధంగా చూడడం, బిగువుగా ఉన్న దుస్తులను వదులు చేయడం, ద్రవాలను తాగించడం, ఎముకలు విరిగిన సూచన కనిపిస్తే వ్యక్తిని కదలకుండా చూడడం, షాక్‌లోకి వెళ్లకుండా మాట్లాడుతూ ఉండడం, గుండె పోటు వచ్చినట్లు అనిపిస్తే ఛాతీపై ఒత్తిడి (సిపిఆర్) పెంచడం, గాయాలకు అయోడిన్‌తో తడిపిన కాటన్‌తో కప్పడం, కృత్రిమ శ్వాస అందించడం, సమయస్ఫూర్తితో అవసరం అనుకున్న ప్రథమ చికిత్సలను చేయడం లాంటివని విధిగా చేయడానికి ప్రయత్నించాలి. ప్రథమ చికిత్స చేయడం కోసం అంటూ ఆసుపత్రికి తరలించడాన్ని ఆలస్యం చేయవద్దు.

ప్రాణాపాయం తప్పించడం, పరిస్థితి జటిలం కాకుండా చూడడం, ఉపశమన చర్యలు చేపట్టడం అనే మూడు సూత్రాల మీద నిలబడిన ప్రథమ చికిత్స ప్రక్రియతో 187 దేశాల్లో 150 మిలియన్ల సేవకులు నిరంతరం సేవలు అందిస్తున్నారు. ప్రపంచ మరణాల్లో 2.2 శాతం మంది రోడ్డు ప్రమాదాల్లోన చనిపోవడం చూస్తున్నాం. హెల్మెట్ వాడడం, సీటు బెల్ట్ పెట్టుకోవడం, ఆల్కహాల్ తీసుకొని డ్రైవింగ్ చేయకపోవడం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపకుండా ఉండడం లాంటి చిన్న చిన్న జాగ్రత్తలు ప్రాణాపాయాన్ని తగ్గించవచ్చనా తెలుసుకోవాలి. ప్రతి ఏట జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 1.35 మిలియన్ల చనిపోవడం, 50 మిలియన్లు గాయపడడం జరుగుతుంది. ఈ మరణాల్లో చాలా వరకు సత్వరమే ప్రథమ చికిత్స అందుబాటులోకి వస్తే తప్పించబడతాయని గమనించాలి. మన కళ్ల ముందు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి కొంత సమయాన్ని కేటాయించి ప్రథమ చికిత్స చేయడం నియమంగా పెట్టుకోవాలి. అధిక జనాభా కలిగిన దేశాల్లో రోడ్డు ప్రమాదాలు అధికంగా నమోదు కావడం సహజం. పౌరులు అందరు ప్రథమ చికిత్స పద్ధతులను తెలుసుకోవడం, ప్రచారం చేయడం, ప్రమాద సమయంలో చికిత్సకు పూనురడకోవడం లాంటి గుణాలను మనం అలవర్చుకోవాలి. ప్రథమ చికిత్సతో ప్రాణాలను కాపాడడం ఒక అదృష్టంగా భావించాలి.



-మధుపాళీ
9949700037

# శక్తిమంతమైన సామాజిక సంస్థలుగా మారిన అంగన్వాడీ కేంద్రాలు: సీఎం యోగి ఆదిత్యనాథ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11:వారణాసిలోని రుద్రాక్ష అంతర్జాతీయ సహకార, సమావేశ కేంద్రం (ఆర్ఐసీసీ)లో 9వ 'రాష్ట్రీయ పోషణ్ మాస్ – 2026'ను కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ రోజు ప్రారంభించింది. 'హమారీ అంగన్‌వాడీ, హమారీ జిమ్మేదారీ' అన్న ప్రధాన ఇతివృత్తంతో.. పోషణపై నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా సాగే ప్రజా ఉద్యమంగా ఇది మొదలైంది.

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి అన్నపూర్ణా దేవి, సహాయ మంత్రి శ్రీమతి సావిత్రీ ఠాకూర్, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ మహిళా, శిశు సంక్షేమ, పోషకాహార శాఖ మంత్రి శ్రీమతి బేబీరాణి మౌర్య ఈ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. వీరితోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులు, భాగస్వామ్య అభివృద్ధి సంస్థల ప్రతినిధులు, క్షేత్రస్థాయి కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోషణ్ అభియాన్ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో, క్షేత్రస్థాయి పోషకాహార సేవలను బలోపేతం చేయడంలో అంగన్‌వాడీ కేంద్రాలు పోషిస్తున్న మార్గదర్శక పాత్రను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్ తన ప్రత్యేక ప్రసంగంలో వివరించారు. వివిధ శాఖల మధ్య నిరంతర సమన్వయం, ప్రజల క్రియాశీల భాగస్వామ్యం, క్షేత్రస్థాయి కార్యకర్తల అంకిత భావమే 'పౌష్టికాహార లోప రహిత భారత్' సాధనకు అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. గడిచిన కొన్నేళ్లలో సాధించిన గణనీయమైన పురోగతిని ఈ సందర్భంగా గుర్తుచేశారు. మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆహ్లాదకరమైన అభ్యాస వాతావరణాన్ని కల్పిస్తూ.. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభావవంతమైన సామాజిక సంస్థలుగా నవీకరించినట్టు సీఎం పేర్కొన్నారు. అంతే కాకుండా అంగన్‌వాడీ కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్లను అందించడం ద్వారా.. డిజిటల్ పర్యవేక్షణతో ఎప్పటికప్పుడు డేటాను నమోదు చేయడం, మెరుగైన సేవలందించడం సాధ్యమవుతో న్నారు. అదనపు పోషకాహార సేవల బలోపేతాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ... రాష్ట్రవ్యాప్తంగా పిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా క్రమం తప్పకుండా వేడివేడి పౌష్టికాహారాన్ని, రేషన్ సరుకులను అందిస్తున్నామని శ్రీ యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. పోషకాహారంపై చేసే పెట్టుబడి ఎన్నడూ వృథా కాదన్నారు. ఆరోగ్యకరమైన పిల్లలు, సాధికారత కలిగిన కుటుంబాలు, బలమైన దేశం రూపంలో అది జీవితకాల ప్రయోజనాన్ని అందిస్తుందని వ్యాఖ్యానించారు.కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి అన్నపూర్ణా దేవి కీలకోపన్యాసం చేశారు. మిషన్ సక్షం అంగన్‌వాడీ, పోషణ్ 2.0 ద్వారా పోషకాహార ఫలితాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆమె పునరుద్ఘాటించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 14 లక్షలకు పైగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 7.5 కోట్లకు పైగా పిల్లలు, 1.10 కోట్ల మంది గర్భిణులు, పాలిచ్చే తల్లులు, దాదాపు 16 లక్షల మంది కిశోర బాలికలకు పోషకాహారం, ఆరోగ్య, ప్రారంభ బాల్య సంరక్షణ సేవలు అందుతున్నాయని ఆమె తెలిపారు. జీవితంలో మొదటి 1,000 రోజుల ప్రాధాన్యాన్ని ఆమె వివరించారు. దేశవ్యాప్తంగా 2 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలను 'సక్షం అంగన్‌వాడీలు'గా ఆధునికీకరిస్తున్నామని, వీటిలో ఉత్తరప్రదేశ్‌లోనే దాదాపు 24,000 కేంద్రాలకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు. 'ప్రధానమంత్రి మాతృ వందన యోజన' పథకానికి విజయవంతంగా పదేళ్లు పూర్తయ్యాయని గుర్తుచేస్తూ.. ప్రత్యక్ష ప్రయోజనాల బదిలీ (డీబీటీ) ద్వారా దేశవ్యాప్తంగా 4.65 కోట్లకు పైగా తల్లుల ఖాతాల్లో రూ. 21,000 కోట్లకు పైగా జమ చేసినట్లు వివరించారు. ఆహార వైవిధ్యం, తగినంత ప్రొటీన్ తీసుకోవడం, వేడివేడి తాజా పౌష్టికాహారం, పారిశుద్ధ్యం, ప్రారంభ బాల్య వికాసంలో సామాజిక భాగస్వామ్యం అత్యంత కీలకమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. సుపోషిత భారత్, వికసిత్ భారత్‌ఏ2047 లక్ష్యాల సాధనలో పోషకాహార చైతన్యాన్ని నిజమైన ప్రజా ఉద్యమంగా మలచాల్సిందిగా ప్రజలకు పిలుపునిచ్చారు.

వేడుకల్లో ప్రదర్శించిన లఘు చిత్రాల్లో చోటు దక్కిన ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలతో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి అన్నపూర్ణా దేవి ఈ సందర్భంగా సంభాషించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తాజా పౌష్టికాహారం, రేషన్ సరుకులు, గృహ సందర్శనలు, పూర్వ బాల్య సంరక్షణ – విద్య (ఈసీసీఈ) అంశాలపై లబ్ధిదారుల అనుభవాలతో ప్రత్యేకంగా వీడియోలను ప్రదర్శించారు.

ఈ సందర్భంగా కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీమతి సావిత్రి ఠాకూర్ ప్రసంగిస్తూ... పోషకాహార ఉద్యమంలో సమాజం, పంచాయతీ రాజ్ సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, కుటుంబాలు క్రియాశీలంగా పాల్గొనాలని, క్షేత్రస్థాయిలో పోషకాహార, శిశు సంరక్షణ సేవలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

స్వాగతోపన్యాసం చేసిన కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ అనిల్ మాలిక్ మాట్లాడుతూ.. 'పోషణ్ అభియాన్' ప్రభుత్వ కార్యక్రమం స్థాయి నుంచి దేశవ్యాప్త ప్రజా ఉద్యమంగా మారిందని, తదుపరి దశలో సామాజిక భాగస్వామ్యాన్ని, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవస్థాగత, సాంకేతిక బలాన్ని... ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోనూ నాణ్యమైన సేవలుగా మలచాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన స్పష్టం చేశారు.

అధికారిక ప్రారంభోత్సవానికి ముందు.. సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'పోషణ్ మేళా'ను వారు సందర్శించారు. పోషకాహారానికి సంబంధించిన వినూత్న ఆవిష్కరణలు, స్థానిక పౌష్టికాహారం, అంగన్‌వాడీ కేంద్రాల అత్యుత్తమ పనితీరుకు సంబంధించిన ప్రదర్శనలను వీక్షించారు.

ఈ సందర్భంగా పోషణ్ మాస్–2026పై రూపొందించిన ఒక ప్రత్యేక ఆడియో–విజువల్ ప్రదర్శన అనంతరం.. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి అన్నపూర్ణా దేవి ఈ దేశవ్యాప్త కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. 'ప్రధాన మంత్రి మాతృ వందన యోజన'కు పదేళ్లు పూర్తయిన సందర్భంగా.. దేశవ్యాప్తంగా తల్లుల ఆరోగ్యం, పోషకాహార ఫలితాలను మెరుగుపరచడంలో ఈ పథకం పాత్రను వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక లఘు చిత్రాన్ని కూడా ప్రదర్శించారు.

2018లో పోషణ్ అభియాన్ ప్రారంభమైనప్పటి నుంచి.. పోషణ్ మాస్, పోషణ్ పఖ్వాడా, ఇతర సామాజిక కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తంగా 150 కోట్లకు పైగా ప్రజా చైతన్య కార్యకలాపాలను నిర్వహించారు. ఈ క్రమంలో సెప్టెంబరు 9 నుంచి అక్టోబరు 8 వరకు నెల రోజుల పాటు రాష్ట్రీయ పోషణ్ మాస్ ? 2026ను దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు. కింద పేర్కొన్న ప్రధాన అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు:

# 'మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పన'పై ఎంఎస్‌డీఈ ఆధ్వర్యంలో 'స్కిల్ మంథన్' నిర్వహణ

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 11:'ళలకు సుస్థిర జీవనోపాధి కల్పన' అనే అంశంపై 'స్కిల్ మంథన్' తొలి సమావేశాన్ని కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ (ఎంఎస్) నిర్వహించింది. వర్చువల్‌గా జరిగిన ఈ చర్చలో ఉత్తరప్రదేశ్‌లోని మీరట్, బిజ్నోర్, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాల్లో చేపట్టిన వినూత్న కార్యక్రమాలను ప్రస్తావించారు. మహిళలకు సుస్థిర జీవనోపాధి అవకాశాలను కల్పించేందుకు జిల్లా పాలన యంత్రాంగాలు నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత అభివృద్ధి, ఆర్థిక సహాయం, సాంకేతికత, మార్కెట్ అవకాశాలను సమన్వయం చేయగల విధానాన్ని ఈ కార్యక్రమాలు చాటిచెప్పాయి. వినూత్నమైన, ప్రభావవంతమైన జిల్లా ఆధ్వర్యంలోని కార్యక్రమాలను ప్రదర్శించేందుకు, వాటిపై జ్ఞానాన్ని పంచుకునేందుకు 'స్కిల్ మంథన్' ఒక వేదికగా నిలవనుంది.

ఈ కార్యక్రమంపై కేంద్ర నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామికవేత్తల శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), విద్యాశాఖ సహాయ మంత్రి శ్రీ జయంత్ చౌదరి మాట్లాడుతూ.. "వృద్ధి, సంస్కరణలు, పరివర్తనకు జిల్లాల పాలన యంత్రాంగాలే నిజమైన చోదక శక్తులు. జిల్లా ఆధారిత ప్రణాళిక విధానం ద్వారా స్థానిక అవసరాలకు అనుగుణంగా, ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈల) అవసరాలకు అనుసంధానమయ్యేలా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఉండేలా చూస్తున్నాం. జిల్లా నైపుణ్యాభివృద్ధి ప్రణాళికల మద్దతుతో నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ.. యువత, స్థానిక ఆర్థిక వ్యవస్థల కోసం మరింత స్పందించే, డిమాండ్ ఆధారిత, ప్రభావవంతమైన ఫలితాలను సాధించేలా జిల్లా పాలనా యంత్రాంగాలు పనిచేస్తున్నాయి" అని అన్నారు.

ఎంఎస్‌డీఈ కార్యదర్శి శ్రీమతి దేబాశ్రీ ముఖర్జీ మాట్లాడుతూ.. "స్థానిక వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు కొనసాగినప్పుడే దేశ నైపుణ్యాభివృద్ధి లక్ష్యాలను సాధించగలం. జిల్లా అవసరాలు, ఉపాధి అవకాశాలకు అనుగుణంగా చేపట్టే స్థానిక స్థాయి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, వేగంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థలో మన యువతకు సంబంధిత నైపుణ్యాలను అ వారిని అర్థవంతమైన జీవనోపాధి అవకాశాలతో అనుసంధానించేందుకు ఎంతో అవసరం" అని అన్నారు.

ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నోర్ జిల్లా కలెక్టర్ శ్రీమతి జస్జిత్ కౌర్, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీషా, ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లా కలెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్ సింగ్‌లు నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత అభివృద్ధి, మార్కెట్ అనుసంధానం ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు దోహదపడే వినూత్న మార్గాలను వివరించారు. మీరట్‌లో మహిళా కేంద్రిత తయారీ నమూనాను ప్రదర్శించారు. ఇందులో బ్యాడ్మింటన్ రాకెట్లు, షటిల్‌కాక్‌ల తయారీలో మహిళలకు ప్రత్యక్ష శిక్షణతో పాటు ఉపాధి కల్పిస్తున్నారు. బిజ్నోర్‌లో 'విదుర్ ప్రేరణ స్వదేశీ' అనే జిల్లా వ్యాప్త వేదిక ద్వారా బ్రాండింగ్, మార్కెట్ అవకాశాలు, వ్యాపార మద్దతు అందిస్తూ గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్న విధానాన్ని వివరించారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 'రైజ్' ఒకే వేదిక ద్వారా నైపుణ్యాభివృద్ధి, రుణ సదుపాయాల కల్పన, మార్గదర్శకత్వం, ఉపాధి అనుసంధానం, పారిశ్రామికవేత్తలకు మద్దతు వంటి సేవలను అందించే సమగ్ర వ్యవస్థను ప్రదర్శించింది. మహిళల నేతృత్వంలోని సంస్థలకు సుస్థిర అవకాశాలను కల్పించేందుకు స్థానిక సంస్థలను సమన్వయం చేయడం ఎలా సాధ్యమవుతుందో ఇది చాటిచెప్పింది.

# వినాయక మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలి

## ఉత్సవాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి: ఎస్ఐ జాడి శ్రీధర్

ఆదిలాబాద్, సెప్టెంబర్ 11:రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని పట్టణ ఎస్ఐ జాడి శ్రీధర్ కోరారు. శుక్రవారం అంగడి బజార్ సమీపంలోని సీఈఆర్ఓ క్లబ్‌లో ఉత్సవ మండలి కమిటీ సభ్యులు, మున్సిపల్ పాలకవర్గం, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై అవగాహన కల్పించారు.



గణేష్ మండళ్ల నిర్వాహకులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎస్ఐ సూచించారు. మండపాల వద్ద విద్యుత్ వైరింగ్, విద్యుత్ కనెక్షన్లు, స్పీకర్ బాక్సులు ఏర్పాటు చేసే సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఉత్సవాలను ఉత్సాహంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యారాణి, వైస్ చైర్‌పర్సన్ మిట్టపల్లి సరిత, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, నాయకులు పల్లె రాజు, శ్రీదేవి, కాదండి సాంబయ్య, కూతురు ప్రభాకర్, జంజిపల్లి శశి, వెనంక శ్రీనివాస్, దామక శిరీష రమేష్, భీమ మల్లేష్, సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య, మిట్టపల్లి శ్రీనివాస్, గోవు రాజం, పెద్దపల్లి ఉప్పలయ్య, వనం సత్యం, ఇప్పకాయల లింగయ్య, కటకం నాగరాజు, పలిగిరి కనకరాజు, పలువురు కౌన్సిలర్లు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా జిల్లా కేంద్రంలో అటవీ అమరుల దినోత్సవం

## అటవీ సంరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించాలి: డీఎఫ్ఓ బాలామణి

ఆదిలాబాద్, సెప్టెంబర్ 11:జిల్లా కేంద్రంలో అటవీ అమరుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి బాలామణి మాట్లాడుతూ అటవీ సంరక్షణపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అటవీ సంరక్షణ ప్రాధాన్యాన్ని తెలియజేసేందుకు గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌ను కలిసిన తొలి ప్రభుత్వ అధికారి శ్రీనివాస్‌ను 2012లో వీరప్పన్ హతమార్చిన ఘటనను గుర్తు చేశారు. శ్రీనివాస్ మృతికి చిహ్నంగా అటవీ అమరుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు.

అటవీ సంరక్షణలో సిబ్బంది వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని బాలామణి సూచించారు. సాధారణ చట్టాలు, అటవీ చట్టాలు పరస్పరం ఎదురైన సందర్భాల్లో అటవీ చట్టాలకే ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వివిధ కారణాలతో అటవీ సంరక్షణలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని, క్షేత్రస్థాయిలో తీసుకునే చర్యలు ఒక్కోసారి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల నిజామాబాద్‌లో ఎఫ్ఆర్ఓ గంగాధర్‌ను పోడు భూముల వివాదం పేరుతో ఫోన్ చేసి పిలిపించి హతమార్చిన ఘటనను గుర్తు చేశారు.

రాత్రి వేళల్లో వచ్చే సమాచారంపై ఒంటరిగా కాకుండా బృందంగా వెళ్లాలని అటవీ సిబ్బందికి సూచించారు. అటవీ సిబ్బంది కదలికలు వన్యప్రాణులకు, వాటి కదలికలు సిబ్బందికి తెలిసే అవకాశం ఉండటంతో వాటి కారణంగా గాయపడటం, ప్రాణాలు కోల్పోవడం తక్కువగా ఉంటుందన్నారు. అయితే సాధారణ ప్రజలు వన్యప్రాణుల విషయంలో చేసే వివిధ ప్రయోగాలు, నిర్లక్ష్యాల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. అవసరమైన జాగ్రత్తలు పాటిస్తే పదవీ విరమణ వరకు అడవికి సేవ చేసే అవకాశం ఉంటుందన్నారు.

ఉద్యోగం ఎంత ముఖ్యమో జీవితానికి కూడా అంతే ప్రాధాన్యం ఉందని బాలామణి పేర్కొన్నారు. బయట ప్రాంతాలతో పోలిస్తే అడవుల్లో వాతావరణ పరిస్థితులు తరచూ మారుతూ ఉంటాయని, సైనికులు వివిధ వాతావరణ పరిస్థితులకు అలవాటు పడి విధులు నిర్వహించినట్లే అటవీ అధికారులు, సిబ్బంది కూడా పరిస్థితులకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. పోడు వ్యవసాయాన్ని తగ్గించడం, వన్యప్రాణులు, వృక్షాలను సంరక్షించడం వంటి కార్యక్రమాల్లో ప్రాణాలు కోల్పోయిన ప్రతి ఒక్కరి త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు అటవీ సంరక్షణలో అమరులైన 26 మంది త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు.



# కార్యదర్శి శ్రీ సుధాంశు పంత్ సమక్షంలో సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖతో అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసిన ఆయా సంస్థలు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11:నషా ముక్త్ భారత్‌ను తయారుచేసే ప్రయత్నాలను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ మరో అడుగు వేసింది. ఢిల్లీలోని మంత్రిత్వ శాఖ చింతన్ కాన్ఫరెన్స్ హాల్‌లో నాలుగు ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థలైన 'అధ్యాత్మ్ విజ్ఞాన సత్సంగ కేంద్రం, చిన్మయ మిషన్, దివ్య జ్యోతి జాగృతి సంస్థాన్, హరే కృష్ణ ఉద్యమం' లతో సామాజిక న్యాయం-సాధికారత శాఖ (డీఓఎస్‌జేఈ) అవగాహనా ఒప్పందాలపై (ఎంఓయూ) సంతకాలు చేసింది.

సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సుధాంశు పంత్, మాదక ద్రవ్యాల నివారణ శాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ సందీప్ ఆర్. రాథోడ్, ఈ శాఖకు చెందిన సీనియర్ అధికారులు, ఆయా ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధుల సమక్షంలో ఈ ఒప్పందాలు కుదిరాయి.

సామాజిక న్యాయం, సాధికారత శాఖ తరఫున డైరెక్టర్ (మాదక ద్రవ్యాల నివారణ) శ్రీ ఆస్తిక్ కుమార్ పాండే ఈ అవగాహనా ఒప్పందాలపై సంతకం చేశారు. సభికుల హర్షధ్వానాల మధ్య ఈ ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు.

అధ్యాత్మ్ విజ్ఞాన సత్సంగ కేంద్రం నుంచి శ్రీ చంద్ర సింగ్, చిన్మయ మిషన్ నుంచి శ్రీమతి ప్రేమ విశ్వనాథ్, దివ్య జ్యోతి జాగృతి సంస్థాన్ నుంచి సాధ్వి శితాభ భారతి, హరే కృష్ణ ఉద్యమం నుంచి శ్రీ ఫతే చంద్ శర్మ ఈ అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు.

మాదక ద్రవ్యాల వ్యసనానికి వ్యతిరేకంగా అవగాహన, నివారణ, సామాజిక సమీకరణ బలోపేతం చేయడానికి ఆధ్యాత్మిక, నైతిక విలువల ఆధారిత సంస్థలకు ఉన్న విస్తృతమైన ప్రభావం, కమ్యూనిటీ నెట్‌వర్క్‌లను ఉపయోగించుకోవడానికి 'నషా ముక్త్ భారత్ అభియాన్' (ఎన్ఎంబీఏ) కింద ఈ శాఖ చేస్తున్న నిరంతర ప్రయత్నాలలో భాగంగా ఈ భాగస్వామ్యాలను కుదుర్చుకుంది.

ఈ సమావేశాన్ని ఉద్దేశించి సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సుధాంశు పంత్ మాట్లాడుతూ.. 'నషా ముక్త్ భారత్' ఆశయ సాధనలో ఆధ్యాత్మిక సంస్థల ప్రాముఖ్యతను ప్రధానంగా చెప్పారు. ఇప్పటికే మంత్రిత్వ శాఖతో కలిసి పనిచేస్తున్న సంస్థల కృషిని ఆయన అభినందించారు. ఎన్ఎంబీఏ కింద వారి సమష్టి కార్యక్రమాల ద్వారా ఈ శాఖ ఇప్పటివరకు 34.42 కోట్లకు పైగా ప్రజలను చేరుకోగలిగిందని ఆయన తెలిపారు.

మత్తుపదార్థాల నివారణ, అవగాహన, పునరావాస సందేశాన్ని ముఖ్యంగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయడానికి నూతనంగా భాగస్వామ్యాలు కుదుర్చుకున్న సంస్థలు తమ విస్తృత నెట్‌వర్క్‌లను పూర్తిగా ఉపయోగించుకోవాలని కార్యదర్శి పిలుపునిచ్చారు. ప్రభుత్వ చొరవ, పౌర సమాజం- ఆధ్యాత్మిక సంస్థల సమష్టి సామర్థ్యం మాదకద్రవ్యాల వ్యసనానికి వ్యతిరేకంగా ఒక సుస్థిర సామాజిక ఉద్యమాన్ని సృష్టించడంలో సహాయపడుతుందని ఆయన చెప్పారు.

ఆధ్యాత్మిక బలం, సామాజిక బాధ్యత, సామాజిక సమీకరణను ఒకదగ్గరికి చేర్చడమే ఎన్ఎంబీఏ కింద ఆధ్యాత్మిక సంస్థల భాగస్వామ్య ప్రధాన ఉద్దేశమని శ్రీ సుధాంశు పంత్ తెలిపారు. వ్యక్తులు, కుటుంబాలలో మానసిక స్థైర్యాన్ని పెంపొందించడంలో, మాదకద్రవ్యాల వ్యసనానికి సంబంధించిన సామాజిక కళంకాన్ని తగ్గించడంలో.. బాధితులు సకాలంలో సహాయం, చికిత్స, పునరావాసం పొందేలా ప్రోత్సహించడంలో వాటి విస్తృత క్షేత్రస్థాయి నెట్‌వర్క్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఈ భాగస్వామ్యాల ద్వారా నివారణ, పునరావాసం, కరుణ, సామాజిక బాధ్యత అనే సందేశాలు సమాజంలోని వివిధ వర్గాలకు చేరేలా చూసుకుంటూ దానిని ఒక సుస్థిర ప్రజా ఉద్యమంగా తయారు చేయడమే మంత్రిత్వ శాఖ లక్ష్యమని కార్యదర్శి స్పష్టం చేశారు.

నషా ముక్త్ భారత్ ఆశయ సాధనకు మనలో ఉన్న సమష్టి సంకల్పాన్ని ఆధ్యాత్మిక, సామాజిక సంస్థల విస్తరిస్తున్న నెట్‌వర్క్ మరింత బలపరుస్తుందని.. 'వికసిత భారత్' నిర్మాణానికి ఇది దోహదపడుతుందని శ్రీ సుధాంశు పంత్ అన్నారు.

మాదక ద్రవ్యాల నివారణ, పునరావాస కార్యక్రమాలలో జనజాగృతి, స్వచ్ఛంద సేవా సమీకరణతో పాటు యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక కౌన్సెలింగ్, నైతిక విలువల ఆధారిత పద్ధతులను కలిపేందుకు ఈ భాగస్వామ్యాలు ఎంతగానో దోహదపడతాయని కార్యదర్శి పేర్కొన్నారు.

సమాజానికి మార్గదర్శనం చేయడంలో, క్రమశిక్షణను పెంపొందించడంలో, విలువలతో కూడిన జీవితాన్ని ప్రోత్సహించడంలో వ్యక్తిగత, కుటుంబ స్థైర్యాన్ని బలపరచటంలో ఆధ్యాత్మిక సంస్థలు పోషిస్తున్న కీలక పాత్రను గుర్తిస్తూ గతంలో 'ది ఆర్ట్ ఆఫ్ లివింగ్, బ్రహ్మకుమారీస్, సంత్ నిరంకారీ మిషన్, ఇస్కాన్, శ్రీ రామచంద్ర మిషన్, అఖండ విశ్వ గాయత్రీ పరివార్, శివానంద యోగ వేదాంత ధన్వంతరి ఆశ్రమం, పతంజలి విశ్వవిద్యాలయా'లతో కూడా మంత్రిత్వ శాఖ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది.

ఈ కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న సంస్థల ప్రతినిధులతో కార్యదర్శి మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి మన సమష్టి నిబద్ధతను మరింత బలోపేతం చేయడానికి ఆయా సంస్థలు తమ ప్రధాన కార్యక్రమాలు, వేడుకలు, బహిరంగ సభలలో కూడా ఈ ప్రతిజ్ఞను చేయించాలని కోరారు.

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాల విషయంలో అవగాహనతో పాటు బాధితుల పునరావాసానికి ఉన్న ప్రాముఖ్యతను తెలియజేస్తూ మంత్రిత్వ శాఖ రూపొందించిన మూడు లఘు చిత్రాలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఎన్ఎంబీఏ పోర్టల్‌లో 'నషా ముక్తి మిత్ర'గా నమోదు చేసుకోవడం, ఈ-ప్రతిజ్ఞ చేయడం వంటి వివిధ కార్యక్రమాల గురించి పాల్గొన్న వారికి వివరించారు.

# వరల్డ్ స్కిల్స్ షాంఘై-2026లో పదకొండు కొత్త నైపుణ్య విభాగాల్లో తొలిసారిగా పోటీపడుతున్న భారత్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: సెప్టెంబర్ 22 నుంచి 27 వరకు చైనాలోని షాంఘైలో జరిగే 48వ వరల్డ్ స్కిల్స్ పోటీల్లో పదకొండు కొత్త నైపుణ్య విభాగాల్లో భారత్ తొలిసారి పాల్గొంటోంది. తద్వారా తన ప్రపంచ నైపుణ్యాల పరిధిని విస్తరించుకుంటోంది.

స్కిల్ ఇండియా బృందంలో దాదాపు 70 మంది పోటీదారులు ఉన్నారు. ఈ బృందం మొత్తం 64 విభాగాలకు గాను 63 నైపుణ్య విభాగాల్లో పోటీల్లో పాల్గొంటుంది. వరల్డ్ స్కిల్స్ పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించిన అతి పెద్ద, అత్యంత వైవిధ్యమైన బృందాల్లో ఒకటిగా ఇది నిలుస్తుంది.

డెంటల్ ప్రోస్తెటిక్స్, డిజిటల్ ఇంటరాక్టివ్ మీడియా డిజైన్, ఇంటెలిజెంట్ సెక్యూరిటీ టెక్నాలజీ, ల్యాండ్‌స్కేప్ గార్డెనింగ్, ఆప్టోఎలక్ట్రానిక్ టెక్నాలజీ, రిటైల్ సేల్స్, మానవ రహిత ఏరియల్ వ్యవస్థలు, ఇండస్ట్రియల్ మెకానిక్స్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, హెవీ వెహికల్ టెక్నాలజీ, ఎయిర్‌క్రాఫ్ట్ నిర్వహణ అనే పదకొండు కొత్త నైపుణ్యాల్లో భారత్ మొదటిసారి పోటీ పడనుంది.

దేశ నైపుణ్యాభివృద్ధి వ్యవస్థ సాధించిన విస్తరణనూ, పరిణతినీ ఈ కొత్త విభాగాల్లో భారత్ పోటీపడటం తెలియజేస్తోంది. సంప్రదాయ వ్యాపారాల్లోని బలమైన పునాదుల నుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలు, ప్రత్యేక సేవలు, సృజనాత్మక పరిశ్రమలు, తర్వాతి తరం పారిశ్రామిక సామర్థ్యాల దిశగా విస్తరిస్తోంది.

నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌డీఈ) ఈ బృందానికి నాయకత్వం వహిస్తోంది. పారిశ్రామిక సంస్థలు, శిక్షణ కేంద్రాలు, ఆయా రంగాల నిపుణులతో కలిసి పనిచేస్తూ నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ) వరల్డ్ స్కిల్స్ కోసం భారత బృందాన్ని సన్నద్ధం చేస్తోంది.

ఈ పోటీల్లో భారత్ పాల్గొనడంపై ఎంఎస్‌డీఈ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ మాట్లాడారు. "భవిష్యత్తు అవసరాలకు తగిన, అంతర్జాతీయంగా ఉపయోగపడే సామర్థ్యాల దిశగా మన నైపుణ్య వ్యవస్థ సాధిస్తున్న పరిణామాన్ని కొత్త నైపుణ్య విభాగాల్లో భారత్ పోటీపడటం తెలియజేస్తోంది. బలమైన భాగస్వామ్యాలు, పటిష్టమైన సన్నాహాల ద్వారా మన యువత ఆత్మవిశ్వాసంతో పోటీ పడటానికి, ప్రపంచ ప్రమాణాలతో తమను తాము పోల్చుకోవడానికి వీలు కల్పిస్తున్నాం" అని ఆమె అన్నారు.

ఆరోగ్యసేవల సాంకేతిక పరిజ్ఞానాలు, డిజిటల్ డిజైన్, నిఘా వ్యవస్థలు, డ్రోన్ టెక్నాలజీలు, అధునాతన తయారీ, రవాణా పరిష్కారాలు, వినియోగదారు కేంద్రక సేవలతో సహా పని భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఆధునిక రంగాలకు కొత్త విభాగాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. వీటిని చేర్చడం... అంతర్జాతీయ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నైపుణ్య రంగాల్లో యువతకు అవకాశాలను అన్వేషించడంపై భారత్ సారించిన దృష్టిని స్పష్టం చేస్తోంది.

ఈ కొత్త విభాగాల్లో పోటీలకు సన్నద్ధమవడానికి కర్ణాటకలోని గవర్నమెంట్ టూల్ రూమ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (జీటీటీసీ), గాంధీనగర్‌లోని మెట్రోవుడ్స్ ల్యాండ్‌స్కేప్, గాంధీనగర్‌లోని నావ్‌టెక్, బెన్నెట్ విశ్వవిద్యాలయం, క్రోమా, టైటాన్ కంపెనీ లిమిటెడ్ ? తనిష్క్, షాపర్స్ స్టాప్, రిలయన్స్ ట్రెండ్స్, ఎస్ఏఎన్‌వై హెవీ ఇండస్ట్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ప్రఖార్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ లిమిటెడ్, డెనెక్స్‌పర్ట్ డెంటల్ ల్యాబ్ లాంటి ప్రత్యేక శిక్షణ సంస్థలు, పారిశ్రామిక భాగస్వాములతో కూడిన సహకారాత్మక వ్యవస్థ తోడ్పాటు అందిస్తోంది.

ఇంటెలిజెంట్ భద్రతా సాంకేతికత: ప్రజలు, మౌలిక వసతులు, ఆస్తులకు భద్రత కల్పించే స్మార్ట్ వ్యవస్థల రూపకల్పన, ఏర్పాటు, నిర్వహణపై ఈ విభాగం దృష్టి పెడుతుంది. ఇందులో కృత్రిమ మేధ ఆధారిత నిఘా వ్యవస్థలు, స్మార్ట్ సెన్సర్లు, స్వయంచాలక స్పందనా వ్యవస్థలు వంటి సాంకేతికతలను ఉపయోగిస్తారు.

ల్యాండ్‌స్కేప్ గార్డెనింగ్: సృజనాత్మకతతో పాటు ఆచరణాత్మకతకు ప్రాధాన్యతనిస్తూ.. పర్యావరణానికి అనుకూలమైన, ఉపయోగకరమైన ప్రదేశాలను రూపొందించేందుకు డిజైన్, నిర్మాణం, పర్యావరణ అవగాహనను కలిపి ఉపయోగించే రంగం ఇది.

ఆప్టోఎలక్ట్రానిక్ సాంకేతికత: కాంతి, విద్యుత్ శాస్త్రాలను కలిపి ఉపయోగించే వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగం ఇది. అధునాతన తయారీ, వైద్య సేవలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, స్మార్ట్ సాంకేతికతలు వంటి అనేక రంగాల్లో ఉపయోగపడుతుంది.

డిజిటల్ ఇంటరాక్టివ్ మీడియా డిజైన్: డిజైన్, కంటెంట్, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను అనుసంధానించడం ద్వారా వివిధ వేదికల్లో ఆకట్టుకునే, వినియోగదారులు చురుగ్గా పాల్గొనే డిజిటల్ అనుభవాలను రూపొందించడం ఈ రంగం ప్రధాన లక్ష్యం.

రిటైల్ అమ్మకాలు: ఉత్పత్తులపై సమగ్ర అవగాహన, కమ్యూనికేషన్, ఉత్పత్తుల ప్రదర్శన, నాణ్యమైన సేవలకు ప్రాధాన్యమివ్వడం ద్వారా వినియోగదారులతో మంచి సంబంధాలు, అనుభవ ఆధారిత వ్యాపార నమూనాలకు పెరుగుతున్న ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుంది.

భారీ వాహన సాంకేతికత: రవాణా, పారిశ్రామిక వ్యవస్థలు మరింత అధునాతనంగా మారుతున్న నేపథ్యంలో లోపాలను గుర్తించడం, మరమ్మతులు చేయడం, నిర్వహణ చేపట్టడం వంటి సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి పెడుతుంది.

మానవ రహిత వైమానిక వ్యవస్థలు: మౌలిక సదుపాయాలు, వ్యవసాయం నుంచి ప్రజా సేవలు, పర్యవేక్షణ, అభివృద్ధి చెందుతున్న స్వయంచాలక సాంకేతికతల వరకు వివిధ రంగాల్లో డ్రోన్ సాంకేతికతల వినియోగంలో విస్తరిస్తున్న తీరును ప్రదర్శిస్తుంది.

డెంటల్ ప్రోస్థెటిక్స్: డెంటల్ క్రౌన్స్, డెంటల్ ఇంప్లాంట్లు, కృత్రిమ దంతాలు వంటి ప్రత్యేక దంత పరికరాలను ఖచ్చితత్వంతో రూపొందించి తయారు చేయడం ఈ రంగం ప్రధాన ఉద్దేశం. ఇవి నోటి ఆరోగ్యానికి సంబంధించిన పనితీరును పునరుద్ధరించడంతో పాటు జీవన నాణ్యతను మెరుగురుస్తాయి.

పారిశ్రామిక యంత్ర సాంకేతికత: సంక్లిష్టమైన పారిశ్రామిక యంత్రాలు, ఉత్పత్తి వ్యవస్థలను ఖచ్చితంగా అమర్చడం, నిర్వహించడం, లోపాలను గుర్తించి పరిష్కరించడం, పనితీరును మెరుగుపరచడం వంటి అంశాలపై ఈ రంగం దృష్టి సారిస్తుంది.

సాఫ్ట్‌వేర్ టెస్టింగ్: కఠినమైన పరీక్షలు, ధ్రువీకరణ ప్రక్రియల ద్వారా సాఫ్ట్‌వేర్ నాణ్యత, విశ్వసనీయత, వినియోగదారుల పనితీరును మెరుగుపరచడంలో సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ కీలక పాత్ర పోషిస్తుంది. విమానాల నిర్వహణ: సంపూర్ణ భద్రత, నిబంధనలకు అనుగుణంగా వాటి నిర్వహణను నిర్ధారించేందుకు విమానంలోని యాంత్రిక, విద్యుత్, ద్రవ, నిర్మాణ వ్యవస్థలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. అవసరమైన సర్వీసింగ్, సమస్యల పరిష్కారం, మరమ్మతులతో పాటు విమానం ప్రయాణానికి సురక్షితంగా ఉందో లేదో కూడా కఠినమైన పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి..

## -కలెక్టర్ బి. సత్యప్రసాద్

కరీంనగర్, సెప్టెంబర్ 11: ధర్మపురి మున్సిపల్ పరిధిలో



కొన సాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా జారీ చేస్తున్న నోటీసులు, వాటిపై నిర్వహిస్తున్న విచారణ, ఓటర్ల నుంచి సేకరిస్తున్న ఆధారాలు, వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఎన్ఐఆర్ నోటీసులపై విచారణను నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల నుంచి సేకరించిన ఆధారాలు, సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు, తేడాలు చోటుచేసు కోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. మ్యాపింగ్ లేని ఓటర్లు, అసమానతలు ఉన్న ఓటర్లకు సంబంధించిన నోటీసులను సంబంధిత ఓటర్లకు వ్యక్తిగతంగా అందజేయాలని ఆదేశించారు.

నోటీసుల జారీ, అందజేత, విచారణ, ఓటర్ల నుంచి ఆధారాల సేకరణ, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు తదితర ప్రతి దశను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు.

అదే సమయంలో అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి సరిదిద్దేలా చర్యలు చేపట్టాలని సూచించారు. "అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే మన లక్ష్యం. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతంగా వ్యవహరించడం, నిబంధనలను కచ్చితంగా పాటించడం అత్యంత ముఖ్యమని" కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు.

అనంతరం 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో ధర్మపురిలోని గోదావరి నది వద్ద జరుగుతున్న పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను వేగవంతం చేసి, ప్రణాళికలకు అనుగుణంగా భక్తులు, వీఐపీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పుష్కర ఘాట్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు

# గణేష్ మండపాలకు పోలీస్ అనుమతి తప్పనిసరి

## ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి: వైరా ఎస్సై రామారావు



ఖమ్మం, సెప్టెంబర్ 11: వినాయక చతుర్థి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు పోలీస్ శాఖ నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని వైరా ఎస్సై రామారావు స్పష్టం చేశారు.

శుక్రవారం వైరాలోని కామిశెట్టి కల్యాణ మండపంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు.

మండపాల ఏర్పాటుకు ముందుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని అనుమతులు పొందాలని తెలిపారు. ఉత్సవాల్లో ధ్వని వ్యవస్థల వినియోగంపై నిబంధనలు పాటించాలని, డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. మండపాల వద్ద భద్రత కోసం కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉత్సవాల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్వాహకులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎస్సై రామారావు కోరారు.

# స్మార్ట్ ఆలోచనల సమ్మిళిత దినచర్యతో లక్ష్య సిద్ధి సుసాధ్యం

**- లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్, కాలమిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణులు**

హైదరాబాద్, సెప్టెంబర్ 11:సక్రమమైన స్మార్ట్ ఆలోచనలతో కూడిన క్రమశిక్షణాయుత దిన చర్యను అలవాటు చేసుకోవడం వల్ల విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో తప్పక రాణించవచ్చని ప్రముఖ వ్యక్తిత్వ వికాస శిక్షకులు, రచయిత, విశ్రాంత ప్రిన్సిపల్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు కరీంనగర్ సెయింట్ జార్జి అంతర్జాతీయ హైస్కూలు ఆవరణలో లీడ్ ఇండియా, శాతవాహన లయన్స్ క్లబ్బుల సంయుక్త అధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ

పిల్లలు బాగా చదవాలి నైతిక విలువలతో , క్రమశిక్షణతో కూడిన ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో మంచి పౌరలుగా గుర్తింపు పొందాలని సమయపాలనతో సక్రమంగా కృషి చేసిన విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించడంలో విజయం పొందాతారని అన్నారు. ప్రతి రోజు విధిగా 3 - 4 గంటలు చదవడం అలవాటు చేసుకోవడం వల్ల జీవితాంతం ఆ మంచి అలవాట్లు మనల్ని ఉన్నత విద్యావంతులను చేస్తాయని అన్నారు. జీవితంతో అత్యంత ఆత్మీయ నేస్తాలుగా పుస్తకాలు మనతో నడుస్తాయని తెలిపారు. పుస్తకాలు హస్తభూషణాలే కాదని, అవి మన మస్తిష్క వికాస నేస్తాలని అన్నారు. ఇష్టంతో కష్టపడి చదివి కలెక్టర్, డాక్టర్, ఇంజనీర్, పోలీస్, లాయర్, ఉపాధ్యాయులు, ఔత్సాహిక వ్యాపారవేత్తలు కావాలని సూచించారు. బలమైన కోరికతో పాటు ఇష్టంగా కష్టపడి చదివి లక్ష్య సాధనకు కృషి చేయాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమములో సెయింట్ జార్జ ఇంటర్నేషనల్ హైస్కూలు చైర్మన్డా ఫాతిమా రెడ్డి అధ్యక్షతన వహించి మాట్లాడుతూ ఇష్టపడి చదివి వారికి విద్య సులభంగా అబ్బుతుందని తెలిపారు. మన కళ్లముందు ఎదిగిన పెద్దలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ప్రియదర్శినితో పాటు

400 మంది విద్యార్థినీవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డిని పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.

# సహకార సంఘాలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి

## నామినేటెడ్ వ్యవస్థను రద్దు చేయాలి.. రైతు సంఘాల్లో ప్రభుత్వ జోక్యం ఎందుకు

కరీంనగర్, సెప్టెంబర్ 11: సహకార సంఘాలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని, నామినేటెడ్ వ్యవస్థను రద్దు చేయాలని సొసైటీ మాజీ చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం లో 906 సహకార సంఘాలు ఉన్నాయని, ప్రస్తుతం అవి లాభాల బాటలో నడుస్తున్నాయని తెలిపారు. సహకార సంఘాలు పూర్తిగా రైతుల వాటాలు, మూలధనం తోనే నడుస్తున్నాయని పేర్కొన్నారు.

వ్యవసాయానికి అవసరమైన పనిముట్లు, పరికరాల కొనుగోలు, ఉద్యోగుల జీతాలు తదితర ఖర్చులను సహకార సంఘాలే భరిస్తున్నాయని రవీందర్ గౌడ్ తెలిపారు. ఇందులో ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టడం లేదన్నారు. అలాంటి సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పద్ధతిలో పాలకవర్గాలను నియమించేందుకు కొత్త జీవోలు తీసుకురావడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఈ విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.కోర్టు ఆదేశాలను సైతం లెక్కచేయకుండా సహకార సంఘాలకు నామినేటెడ్ పద్ధతిలో పాలకవర్గాలను ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని ఆయన అన్నారు. వెంటనే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలవలేమనే ఉద్దేశంతో, రైతులు ఓట్లు వేయరనే భయంతో ఎన్నడూ లేని విధంగా నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్, పాలకవర్గాన్ని నియమించడం అన్యాయమని పేర్కొన్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా ఈ విధానాన్ని విరమించుకుని సంబంధిత జీవోను రద్దు చేసి ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

# కోల్ ఇండియా పోటీల్లో సత్తా చాటాలి

## సింగరేణి క్రీడాకారులకు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి రమేష్ పిలుపు

కరీంనగర్, సెప్టెంబర్ 11: కోల్ ఇండియా స్థాయిలో జరగనున్న క్రీడా పోటీల్లో సింగరేణి క్రీడాకారులు ప్రతిభ చాటి సంస్థకు పేరు తీసుకురావాలని రామగుండం ఏరియాలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు-5 ప్రాజెక్టు అధికారి డి. రమేష్ పిలుపునిచ్చారు. గురువారం గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో సింగరేణి రామ గుండం ఏరియా అంతర్గత విభాగాల క్రీడా పోటీల్లో భాగంగా కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి రమేష్ మాట్లాడుతూ.. క్రీడల అభివృద్ధికి సింగరేణి యాజమాన్యం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.క్రీడలతో మానసిక ఉల్లాసం, ఆరోగ్యం మెరుగుపడతాయని రమేష్ పేర్కొన్నారు. ప్రతి సింగరేణి కార్మికుడు ఏదో ఒక క్రీడలో నైపుణ్యాన్ని పెంపొందించు కోవాలని సూచించారు. క్రీడల కోసం కేటాయించిన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోటీల్లో ప్రతిభ కనబరచాలని, తద్వారా సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా నిర్వహించాలి..



నల్గొండ, సెప్టెంబర్ 11:సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని కోరుతూ బీజేపీ మునుగోడు మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

అనంతరం పెంబళ్ల జానయ్య మాట్లాడుతూ.. తెలంగాణ విమోచన చరిత్రను శాశ్వతంగా పరిరక్షించేందుకు 'తెలంగాణ సప్త సంకల్పాలు' అమలు చేయాలని కోరారు.

1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కంభంపాటి నరసింహ, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కర్నాటి లింగయ్య, ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు పందుల నరసింహ, మండల ప్రధాన కార్యదర్శి అక్కెనపల్లి సతీష్, నాయకులు బొలుగురి రమేష్, మేక మాధవరెడ్డి, మోగుదాల శంభు, నాతి నరసింహ, వార్డు సభ్యుడు సూర శ్రీశైలం, పంతంగి వెంకన్న, పెరుమాల శ్రీరామ్, బీసం కృష్ణ, ముంత శీను, సూర శ్రీకాంత్, సుక్క నరేందర్, మాధగోని స్వామి, సుక్క శంకర్, పిట్టల రాములు తదితరులు పాల్గొన్నారు.

# రైతు గుర్తింపు కార్డుకు నమోదు తప్పనిసరి

నల్గొండ, సెప్టెంబర్ 11: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందాలంటే రైతు గుర్తింపు కార్డు కోసం నమోదు తప్పనిసరని ఏఈఓ షేక్ వహీద్ తెలిపారు. శుక్రవారం చల్మెడ క్లస్టర్ పరిధిలోని రైతువేదికలో ఫార్మర్ రిజిస్ట్రీలో రైతుల వివరాల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

క్లస్టర్ పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో హాజరై తమ వివరాలను నమోదు చేసుకున్నారు. ఇప్పటికే అధిక సంఖ్యలో రైతులు తమ వివరాలను నమోదు చేసుకున్నారని ఏఈఓ తెలిపారు.

ఇంకా నమోదు చేసుకోని రైతులు త్వరగా ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ పరిధిలోని పలువురు రైతులు పాల్గొన్నారు.

# గువహటిలోని ఎన్ఆర్ఎల్ సెంటర్‌లో రేపు ప్రత్యేక కో వర్కింగ్ స్పేస్, ఇన్నొవేషన్ కేంద్రాన్ని ప్రారంభించనున్న ఎంసీ2

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: దేశంలో, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో అంకుర సంస్థలు, ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేసే క్రమంలో.. ఎంసీ+ సంస్థ రేపు కీలక ముందడుగు వేయనుంది. గువహటీలోని ఎన్ఆర్ఎల్ సెంటర్ ఆరో అంతస్తులో ప్రత్యేక 'నోడ్, కో వర్కింగ్ స్పేస్'ను ప్రారంభించనుంది.

గువహటి కేంద్రంగా నిర్మించిన ఈ నూతన కేంద్రాన్ని... అంకుర సంస్థలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తల కోసం ఒక ప్రభావవంతమైన, సహకారాత్మక, వృత్తిపరమైన సదుపాయాలతో కూడిన వాతావరణాన్ని అందించే వేదికగా తీర్చిదిద్దారు. వర్ధమాన సంస్థల మారుతున్న అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఈ కేంద్రం.. అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, నిపుణుల మార్గనిర్దేశం, సాంకేతిక నైపుణ్యం, పెట్టుబడిదారులతో అనుసంధానం, పారిశ్రామిక భాగస్వామ్యాలను ఒకే ఛత్రం కిందికి తెస్తోంది.

50కి పైగా నిర్దిష్ట పని ప్రదేశాలు, 16 క్యాబిన్లు, 4 పెట్టుబడిదారుల మీటింగ్ రూంలు, 2 సాంకేతిక సంప్రదింపుల రూంలతోపాటు 2 సమావేశ మందిరాలు, పూర్తిస్థాయి కెఫ్టేరియా, ఉమ్మడి ప్రాంగణాలు ఈ కేంద్రంలో అందుబాటులో ఉన్నాయి. దేశంలోని ప్రముఖ అంకుర సంస్థలు, ఆవిష్కరణ ప్రాంగణాలకు సరిసమానంగా.. అత్యుత్తమ ప్రమాణాలతో ఈ మౌలిక వసతులను రూపొందించారు. ఇది అంకుర సంస్థలు పనిచేసుకోవడానికి, పరస్పర సహకారానికి, అభివృద్ధి చెందడానికి ఒక వృత్తిపరమైన, ప్రస్తుత ధోరణులకు తగిన వాతావరణాన్ని అందిస్తుంది.

ఈ పెట్టుబడిదారుల మీటింగ్ రూంలు.. అంకుర సంస్థల వ్యవస్థాపకులు పరస్పరం ఆలోచనలను పంచుకోవడానికీ, పెట్టుబడిదారులతో చర్చించడానికీ, నిధుల సేకరణతోపాటు వ్యూహాత్మక భాగస్వామ్య అవకాశాల అన్వేషణకూ ప్రత్యేక వేదికను అందిస్తాయి. అలాగే సాంకేతిక సంప్రదింపుల రూంలు నిపుణులతో ముఖాముఖి చర్చలకు వీలు కల్పిస్తూ.. సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి, ఉత్పత్తుల మెరుగుదల, సాంకేతిక సవాళ్ల పరిష్కారంలో అంకుర సంస్థలకు మార్గనిర్దేశాన్ని అందిస్తాయి.

ఈ ప్రాంగణం అందించే సేవలు భౌతిక మౌలిక వసతులకు మాత్రమే పరిమితం కాలేదు. అంకుర సంస్థలకు విభిన్న రంగాల నిపుణులు, సాంకేతిక సలహాదారులు, న్యాయ నిపుణులు, ప్రత్యేక ఆర్థిక, ఆడిట్ నిపుణులతో కూడిన ఒక సమగ్ర సహాయక

వ్యవస్థ ఎంసీ2 ని అందుబాటులోకి తేనుంది. ఇది సాంకేతికత – ఉత్పత్తుల అభివృద్ధి, మేధో సంపత్తి, ఒప్పందాలు – నియంత్రణా నిబంధనలు, ఆర్థిక ప్రణాళిక, అకౌంటింగ్, ఆడిట్ సన్నాహకాలు, అనుమతులు, వ్యాపార పునర్నిర్మాణం వంటి కీలక అంశాల్లో వృత్తిపరమైన మార్గనిర్దేశాన్ని పొందడానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎంతగానో తోడ్పడుతుంది.

సంప్రదాయ పనిప్రదేశాల మాదిరిగా కాకుండా... ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కాసేపు విశ్రాంతి తీసుకోవడానికీ, తమ ఆలోచనలను పంచుకోవడానికీ, భవిష్యత్తులో అర్థవంతమైన భాగస్వామ్యాలుగా అవతరించగల పరిచయాలను ఏర్పరచుకోవడానికీ అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేలా ఒక పూర్తిస్థాయి కెఫ్టేరియా, కేఫ్ప్యాంటీని ఇక్కడ తీర్చిదిద్దారు. ఆత్మీయ చర్చలకు, నెట్వర్కును పెంచుకునేందుకు వేదికగా ఇది ఉపయోగపడుతుంది.

అంకుర సంస్థలకు కేవలం పనిచేసుకోవడానికి ఒక స్థలాన్ని మాత్రమే కాకుండా, అంతకు మించి ఒక బలమైన వేదికను అందించడమే ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యం. తమ వ్యాపార ప్రయాణంలోని వివిధ దశల్లో అత్యవసరమైన మౌలిక వసతులను, విషయ పరిజ్ఞానాన్ని, నిపుణుల మార్గదర్శకత్వాన్ని, వృత్తిపరమైన సలహాలను ఒకే చోట అందించేలా దీన్ని రూపొందించారు.

గువహటిలోని ఎన్ఆర్ఎల్ సెంటర్‌లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం.. గువహటి, ఈశాన్య రాష్ట్రాల్లో అంకుర సంస్థలు, ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఒక కీలకమైన ముందడుగు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, నిపుణులు, పెట్టుబడిదారులు, పరిశ్రమ భాగస్వాములను ఒక్కచోటకు తెచ్చి... ఆవిష్కరణ దశ నుంచి అభివృద్ధి, ధ్రువీకరణ, విస్తరణ దశల వరకు ఆలోచనలను ముందుకు తీసుకెళ్లేందుకు వీలు కల్పించే వాతావరణాన్ని సృష్టించడమే దీని లక్ష్యం.

గువహటిలోని ఎన్ఆర్ఎల్ సెంటర్‌లో రేపు, అంటే 2026 సెప్టెంబరు 10న దీన్ని అధికారికంగా ప్రారంభించబోతున్నారు.

# డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అధ్యక్షతన ముంబయిలో

## సెప్టెంబర్ 11, 12 తేదీల్లో భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల జాతీయ సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: మహారాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ముంబయిలో సెప్టెంబర్ 11, 12 తేదీల్లో భవన, ఇతర నిర్మాణ కార్మికుల (బీఓసీడబ్ల్యూ) కోసం కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ జాతీయ సదస్సును నిర్వహించనుంది. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ-యువజన వ్యవహారాలు, క్రీడలశాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అధ్యక్షతన ఈ సదస్సు జరగనుంది. కేంద్ర కార్మిక, ఉపాధి-సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ సహాయ మంత్రి శ్రీమతి శోభా కరంద్లాజే, వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కార్మిక శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు, బీఓసీడబ్ల్యూ సంక్షేమ బోర్డుల చైర్‌పర్సన్లు, కార్యదర్శులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు ఈ సదస్సులో పాల్గొంటారు.

దేశంలోనే అతిపెద్ద ఉపాధి కల్పించే రంగాల్లో నిర్మాణ రంగం ఒకటిగా ఉంటూ.. లక్షలాది మంది కార్మికుల జీవనోపాధికి ఆధారంగా నిలుస్తోంది. కొత్త కార్మిక చట్టాల అమలుతో మారుతున్న బీఓసీడబ్ల్యూ వ్యవస్థను సమీక్షించేందుకు, సంక్షేమ బోర్డుల పనితీరును మరింత బలోపేతం చేసేందుకు ఈ సదస్సు కీలక వేదికగా నిలవనుంది. చట్టపరమైన బాధ్యతలు, కార్మికుల నమోదు, సంక్షేమ పథకాల అమలు, సంక్షేమ నిధుల పర్యవేక్షణ, వినియోగం వంటి అంశాలపై సదస్సులో చర్చించనున్నారు. వివిధ శాఖలు, సంస్థల మధ్య సమన్వయం పెంపొందించడం, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా సేవలను అందించడంలో ఉన్న అవకాశాలనూ పరిశీలించనున్నారు.

రాష్ట్రాల బీసీఓడబ్ల్యూ సంక్షేమ బోర్డులు అమలు చేస్తున్న వినూత్న విధానాలు, విజయవంతమైన కార్యక్రమాలను సదస్సులో పంచుకోనున్నారు. నిర్మాణ కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా, సమర్థవంతంగా అందేలా.. ఇతర రాష్ట్రాలు కూడా వీటిని అనుసరించి అమలు చేయగల ఉత్తమ విధానాలను గుర్తించేందుకు ఈ చర్చలు దోహదపడనున్నాయి.

2025 నవంబర్‌లో న్యూఢిల్లీలో జరిగిన జాతీయ కార్మిక సదస్సులో ప్రారంభించిన మూడు ప్రధాన కార్యక్రమాలైన రాష్ట్ర బీఓసీడబ్ల్యూ డిజిటల్ లేబర్ చౌక్, లేబర్ చౌక్-ఫెసిలిటేషన్ సెంటర్లు, ఆన్‌లైన్ బీఓసీడబ్ల్యూ సెస్ వసూలు వేదికల పురోగతిని ఈ సదస్సులో సమీక్షించనున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా కార్మికులకు ఉపాధి అవకాశాలను బలోపేతం చేయడం, వారికి గౌరవప్రదమైన, సులభంగా అందుబాటులో ఉండే సేవలు అందించడం, సెస్ వసూలు, పర్యవేక్షణలో పారదర్శకత, సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో అంతర్జాతీయ కార్మిక చలనశీలత మార్గాలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, కార్మిక గణాంకాలు, లేబర్ స్టాక్ వంటి అంశాలపై కూడా చర్చించనున్నారు. కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, బీసీఓడబ్ల్యూ సంక్షేమ బోర్డుల మధ్య మరింత సమన్వయం పెంచడం, అమలులో ఉన్న లోపాలను గుర్తించడం, నిర్మాణ కార్మికులకు సామాజిక భద్రత, సంక్షేమం, ఉపాధి అవకాశాలు మరింత సమర్థవంతంగా, సులభంగా అందేలా ప్రాధాన్యతా చర్యలను రూపొందించడం ఈ సదస్సు లక్ష్యం.

# వ్యవసాయానికి 18 గంటల కరెంటు ఇవ్వాలి ..

## ఏఈకి సర్పంచుల వినతి

అమరావతి, సెప్టెంబర్ 11: వేల్పూర్ మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యపై మండలంలోని పలు గ్రామాల సర్పంచులు శుక్రవారం వేల్పూర్ విద్యుత్ శాఖ ఏఈకి వినతి పత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా వ్యవసాయానికి సక్రమంగా కరెంటు సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వరి పంటలన్నీ కీలకమైన పొట్ట దశలో ఉన్నాయని, సకాలంలో నీరు అందించకపోతే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు.

తక్కువ గంటలు కరెంటు ఇవ్వడం, ఇచ్చిన సమయంలో కూడా తరచూ అంతరాయం కలగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే స్పందించి వ్యవసాయ మోటార్లకు నిరంతరాయంగా 18 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, రైతులను ఆదుకోవాలని ఏఈని కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఏఈ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు తిట్ల శ్రీనివాస్, బేల్దారి నవీన్, జిన్నా జనార్ధన్, దొల్ల రమేష్ రెడ్డి, ఉప సర్పంచులు కృష్ణారెడ్డి, నరేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు


సాహిత్యం సంగీతం



శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయ గానసభ
సంయుక్త ఆధ్వర్యంలో
ఆహ్వానం



ప్రముఖ రచయిత
శ్రీ మాయకుంట్ల నారాయణరెడ్డి గారు
రచించిన
వారేరీ...!?
పుస్తకావిష్కరణ, అంకితోత్సవం





పుస్తకం అంకిత స్వీకర్త :
శ్రీ బైస దేవదాస్ గారు
సంపాదకులు, 'నేటి నిజం' దినపత్రిక

తేది : 13-09-2026 ఆదివారం ఉ॥ 10-30 గం॥లకు
వేదిక : గుండవరపు హనుమంతరావు కళావేదిక, శ్రీ త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్

ముఖ్య అతిథి & ఆవిష్కర్త :
పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు
పూర్వ ఉపకులపతి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయము

సభాధ్యక్షులు : ఆచార్య టి. గౌరీ శంకర్ గారు
పూర్వ రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయము

విశిష్ట అతిథి : శ్రీ కళా వి.ఎస్. జనార్ధనమూర్తి గారు
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ

పుస్తక పరిచయం : డా॥ నోరి రాజేశ్వరరావు గారు విశ్రాంత ఉపన్యాసకులు

ఆత్మీయ అతిథి : శ్రీ జెల్ది విద్యాధరరావు గారు అధ్యక్షులు, విమల సాహితీ సమితి

అందరూ ఆహ్వానితులే

కళా శారద దీక్షితులు, ప్రధాన కార్యదర్శి, శ్రీ త్యాగరాయ గానసభ
బండారుపల్లి రామచంద్రరావు, అధ్యక్షులు, మానస ఆర్ట్స్
డా॥ లలితవాణి, ఉపాధ్యక్షులు, మానస ఆర్ట్స్
రఘుశ్రీ, కార్యదర్శి, మానస ఆర్ట్స్


# న్యూఢిల్లీలో అక్టోబరు 21 నుంచి 23దాకా అంతర్జాతీయ 7వ అగ్రివోల్టాయిక్స్ సదస్సు-2026

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11:'దేశానికి అన్నం పెట్టే రైతన్న నేడు విద్యుత్ ప్రదాతగా ప్రజానీకానికి వెలుగులు పంచుతున్నాడు" అని కేంద్ర నవ్య-పునరుత్పాదక ఇంధన, విద్య-వినియోగదారు వ్యవహారాలు-ఆహార-ప్రజా పంపిణీ శాఖల మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి అన్నదాతలను కొనియాడారు. న్యూఢిల్లీలో నిర్వహించనున్న అంతర్జాతీయ 7వ అగ్రివోల్టాయిక్స్-2026 సదస్సుకు ముందు ఇవాళ ఏర్పాటు చేసిన సన్నాహక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

'పీఎం-కుసుమ్' పథకం తదుపరి దశలో 'అగ్రివోల్టాయిక్స్' కోసం ప్రత్యేక కార్యక్రమం అంతర్భాగంగా ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.

తద్వారా రైతులు వ్యవసాయం కొనసాగిస్తూనే విద్యుదుత్పాదన ద్వారానూ ఆదాయార్జన చేయగలరని ఆయన తెలిపారు. ఈ క్రమంలో రైతుకు భూమి హక్కు కొనసాగుతుందని, చిన్న-సన్నకారు రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, సహకార సంఘాలు, పంచాయతీలపై దృష్టి సారిస్తామని వివరించారు. సాధారణంగా రుతుపవనాలు, మార్కెట్ ధరలపై ఆధారపడి జీవించే రైతులకు సౌర విద్యుదుత్పాదన ద్వారా మరింత ఆదాయ భద్రత లభిస్తుందని ఆయన అన్నారు.

ఒక ఎకరా భూమి నుంచి రైతు మూడు రకాల ఆదాయార్జన చేయవచ్చునని శ్రీ జోషి పేర్కొన్నారు. ఈ మేరకు పంట అమ్మకం, డిస్కామ్‌కు విద్యుత్ విక్రయం, డీజిల్‌పై పొదుపుతో 'త్రివిధ ఆదాయం' పొందగలరని విశదీకరించారు. ఒక చిన్న రైతుకు సౌరశక్తి ద్వారా అదనపు ఆదాయం లభించడం మాత్రమే కాకుండా ఆదాయ భద్రతకు అదొక ఉపకరణం కాగలదన్నారు. కాలం కలిసివచ్చినా, కరవుకాటకాలు సంభవించినా ఇదొక సుస్థిర ఆదాయ వనరుగా నిలుస్తుందని ఆయన తెలిపారు.

ప్రపంచ జనాభాలో భారత్ వాటా సుమారు 18 శాతం కాగా, భూభాగంలో వాటా కేవలం 2.4 శాతం మాత్రమేనని మంత్రి గుర్తుచేశారు

దేశంలోని అన్నదాతలలో 85 శాతానికి పైగా 2 హెక్టార్లకు మించి కమతాలు లేనివారేనని.. అంటే- చిన్న, సన్నకారు రైతులేనని మంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అగ్రివోల్టాయిక్స్ విధానం అమలులోకి వస్తే పంటకు, సౌర విద్యుత్ ప్లాంట్‌కు మధ్య ఏదో ఒకటి ఎంచుకునే పరిస్థితి ఉండదని చెప్పారు. ఈ రెండింటినీ ఏకకాలంలో కొనసాగించడం అంటే- ఆ భూమిలో పంట సాగుతో పాటు కాలుష్య రహిత విద్యుత్తును కూడా ఉత్పత్తి చేసే వీలుంటుందని వివరించారు.

భారత్ నిరుడు 55.29 గిగావాట్ల మేర అదనంగా శిలాజేతర విద్యుత్ సామర్థ్యాన్ని జోడించిందని శ్రీ జోషి గుర్తుచేశారు. నార్వే (40.6 గిగావాట్లు), స్విట్జర్లాండ్ (సుమారు 30 గిగావాట్లు), ఆస్ట్రియా (34 గిగావాట్లు), బెల్జియం (సుమారు 33 గిగావాట్లు) వంటి అనేక అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యంకన్నా ఇది అధికమని మంత్రి అన్నారు.

పీఎం-కుసుమ్ పథకం కింద సాధించిన ప్రగతిని ప్రముఖంగా ప్రస్తావిస్తూ- సుమారు 29 లక్షల పంపులను సౌరశక్తితో అనుసంధానించామని శ్రీ జోషి తెలిపారు. అలాగే, నిరుడు వికేంద్రీకృత సౌరశక్తి 16.3 గిగావాట్ల విద్యుత్తును సరఫరా చేయగా, ఇందులో పీఎం-కుసుమ్ వాటా 7.6 గిగావాట్లు ప్రధానంగా 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన' కింద పైకప్పు సౌరశక్తి ద్వారా 8.7 గిగావాట్లుగా ఉందని చెప్పారు. తద్వారా 56 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు ప్రయోజనం కలిగిందని ఆయన వెల్లడించారు.

వివిధ పంటలు, వాతావరణాలు, ప్రాంతాలకు ఏది ఉత్తమమో అవగాహన చేసుకోవడానికి అగ్రివోల్టాయిక్స్‌పై మరింత పరిశోధన అవసరమని కేంద్ర మంత్రి ప్రస్ఫుటం చేశారు. పుణెలోని 'బీఏఐఎఫ్' గ్రామీణ ఆవిష్కరణల కేంద్రం పరిశోధకులు 30 పంటలతో 17 సౌర విద్యుత్తు సంధాన విధానాలను పరీక్షిస్తున్నారని ఆయన ప్రస్తావించారు. ప్రతి సాగు పరిస్థితితో పంట, ప్యానెల్ ఎత్తు, అంతరం, ట్రాకింగ్ వ్యవస్థ, వ్యాపార నమూనాల సముచిత సమ్మేళనం నిర్ధారణ ప్రాధాన్యాన్ని ఆయన స్పష్టం చేశారు.

ట్రాక్టర్లు, పంటకోత యంత్రాలు స్వేచ్ఛగా తిరిగే, స్థానిక వాతావరణ పరిస్థితులను తట్టుకోగల నిర్మాణాలపై ఐసీఏఆర్, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వ్యవసాయ విజ్ఞాన కేంద్రాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. ఈ మేరకు పంటల వారీ, ప్రాంతాలవారీ సమాచార సేకరణ, సంప్రదాయ సౌరశక్తి మధ్యగల వ్యయ వ్యత్యాసం తగ్గించేగల నిర్మాణాలు, పదార్థాలు, మౌంటింగ్ వ్యవస్థల ఆవిష్కరణపై పరిశ్రమ, ఆవిష్కర్తలు, భాగస్వాములు దృష్టి సారించాలని శ్రీ జోషి కోరారు.

భారత్ ఇప్పటికే గ్రామీణ స్థాయిలో నైపుణ్య వికాసానికి చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగా దాదాపు 70,000 మంది 'సూర్య మిత్ర'లకు శిక్షణ ఇచ్చిందని ఆయన తెలిపారు.

భారత వ్యవసాయ-సౌరశక్తి అనుభవం ప్రత్యేకించి పేద దేశాలకు ప్రయోజనకరమని మంత్రి అన్నారు.

ఆయా దేశాల్లోనూ రైతులు చిన్న కమతాల యజమానులే కావడం, సూర్యరశ్మికి కొదవ లేకపోవడం వంటి అవకాశాలున్నాయని తెలిపారు. అయితే, గ్రిడ్‌ల విషయంలో మరింత ప్రగతి సాధించాల్సి ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా పేద దేశాలన్నిటా అనుసరించగల సరళ, చౌక, ఆచరణాత్మక పరిష్కారాల రూపకల్పనలతో భారత్‌కుగల విశాల అనుభవం ఒక అవకాశం కల్పిస్తుందని ఆయన అన్నారు.

ఈ సన్నాహక కార్యక్రమంలో భాగంగా అధికారిక సదస్సు లోగోను కేంద్ర మంత్రి ఆవిష్కరించారు. అలాగే, అంతర్జాతీయ 7వ అగ్రివోల్టాయిక్స్ సదస్సు-2026 టీజర్‌ను కూడా విడుదల చేశారు. "పొలాల నుంచి వినియోగదారుకు వరకూ ఆవిష్కరణలకు ఇంధనం" ఇతివృత్తంగా 'అగ్రివోల్టాయిక్స్ పిచ్ హబ్'ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీనికి 'నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' విజ్ఞాన భాగస్వామిగా వ్యవహరించనుంది. ఆహారం, ఇంధనం, ఫైబర్ అనే '3ఎఫ్' చట్రం ప్రాతిపదికగా నిర్మితం కానున్న 'ఈ పిచ్ హబ్' అగ్రివోల్టాయిక్స్ భవిష్యత్తుకు దోహదపడే వినూత్న పరిష్కారాలను ఆహ్వానిస్తుంది.

నేటి కార్యక్రమంలో అనేక జాతీయ, అంతర్జాతీయ భాగస్వాములతో పాటు మంత్రిత్వశాఖలు, రాష్ట్ర విభాగాలు, పరిశోధన-పారిశ్రామిక రంగాల సీనియర్ అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యూఢిల్లీలోని భారత్ మండపంలో అక్టోబరు 21 నుంచి 23 వరకూ అంతర్జాతీయ 7వ అగ్రివోల్టాయిక్స్ సదస్సు-2026ను నిర్వహిస్తారు. ఈ మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ-సౌరశక్తి భవితవ్యంపై చర్చలతోపాటు ఈ రంగం విస్తరణకు గల మార్గాన్వేషణకు ప్రపంచవ్యాప్త రైతులు, విధాన రూపకర్తలు, పరిశోధకులు, పారిశ్రామిక అగ్రగాములు, అంతర్జాతీయ ప్రతినిధి బృందాలు, ఇతర భాగస్వాములను ఒకే వేదికపైకి వస్తారు.

జాతీయ-అంతర్జాతీయ భాగస్వాముల అనుభవ ఆదానప్రదానానికి, భాగస్వామ్యాల ఏర్పాటుకు, వ్యవసాయం-సౌరశక్తి ఏకీకరణ దిశగా ఆచరణాత్మక మార్గాన్వేషణకు ఈ సదస్సు కీలక వేదిక కాగలదని అంచనా. రైతు-కేంద్రక, సుస్థిర, విస్తరణీయ వ్యవసాయం-సౌరశక్తి పరిష్కారాన్వేషణ సహా ఈ రంగంపై అంతర్జాతీయ చర్చకు స్ఫూర్తినివ్వడంలో భారత్ పాత్ర బలోపేతానికీ ఇది ఉపకరిస్తుంది.

# గంజాయి అక్రమ రవాణాపై దేశవ్యాప్తంగా చేపట్టిన దాడుల ద్వారా 740 కేజీల గంజాయి, చరస్ ను స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ...13 మంది అరెస్టు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11:మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా వర్గాల సమాచారం మేరకు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు దేశవ్యాప్తంగా ఎనిమిది కీలక ప్రాంతాలపై దాడులు చేశారు. 15 రోజులపాటు సాగిన ఈ దాడుల్లో దాదాపు 740 కేజీల గంజాయి (హైడ్రోపోనిక్ గంజాయి సహా), చరస్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఎన్‌డీపీఎస్ చట్టం-1985 ప్రకారం13 మందిని అరెస్టు చేశారు. స్వాధానం చేసుకున్న మాదకద్రవ్యాల్లో 709.6 కేజీల గంజాయి, 24.5 కేజీల హైడ్రోపోనిక్ గంజాయి, 5 కేజీల చరస్ ఉన్నాయి.

నిఘా వర్గాల సమాచారం ఆధారంగా 08.09.2026న జరిగిన దాడిలో రాయ్‌పూర్ సమీపంలోని ఓల్డ్ ధంతరి రోడ్ వద్ద విశాఖపట్నం నుంచి వస్తున్న రెండు ట్రక్కులను డీఆర్ఐ అధికారులు తనిఖీ చేశారు. సరకును లారీల్లోకి తరలిస్తున్న ప్రాంతాల్లో 10 సంచుల్లో ఉన్న 61 ప్యాకెట్లలో గంజాయి ఉన్నట్లు అనుమానించారు. పరీక్షలు నిర్వహించగా అది గంజాయి అని తేలింది. ఈ తనిఖీల్లో భాగంగా 375.95 కేజీల గంజాయిని, రవాణా చేస్తున్న రెండు ట్రక్కులను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం-1985 కింద నలుగురిని అరెస్టు చేశారు.అంతకు ముందు 26.08.2026న రాయ్‌పూర్ సమీపంలో... ఓ ట్రక్కులో 124 కేజీల గంజాయిని డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. ట్రక్కును స్వాధీనం చేసుకుని ఎన్‌డీపీఎస్ చట్టం-1985 ప్రకారం ఒకరిని అరెస్టు చేశారు.

సరైన సమాచారంతో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించిన మరికొన్ని దాడుల్లో పాట్నా సమీపంలోని ఔరంగాబాద్-పాట్నా హైవేపై డీఆర్ఐ అధికారులు ఓ లారీని అడ్డగించారు. ఈ తనిఖీల సమయంలో అధికారులపై దాడి జరగడంతో ఒక అధికారికి గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ పరారయ్యాడు. వాహనాన్ని తనిఖీ చేయగా, డ్రైవర్ క్యాబిన్ వెనక రహస్య అరలోని 90 ప్యాకెట్లలో గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. ఎన్‌డీపీఎస్ చట్టం-1985 ప్రకారం140.5 కిలోల గంజాయిని, లారీని స్వాధీనం చేసుకున్నారు.

పంజాబ్‌లోని లుధియానా సమీపంలో ఈ నెల 1, 2వ తేదీల్లో మరొక అనుమానాస్పద వాహనాన్ని డీఆర్ఐ అధికారులు అడ్డగించారు. తనిఖీ చేయగా, కారు కింద భాగంలోని రహస్య అరల్లో దాచిన 67 గంజాయి ప్యాకెట్లలో 69 కిలోల గంజాయిని గుర్తించారు.

# గుజరాత్‌లోని ఎన్ఎఫ్ఎస్‌యూ, గిఫ్ట్ సిటీని సందర్శించిన తెలంగాణ మీడియా ప్రతినిధుల బృందం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11:హైదరాబాద్‌లోని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) ఆధ్వర్యంలో జరుగుతున్న గుజరాత్ మీడియా పర్యటనలో భాగంగా తెలంగాణ మీడియా ప్రతినిధుల బృందం ఈ రోజు గాంధీ నగర్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ విశ్వవిద్యాలయం (ఎన్ఎఫ్ఎస్‌యూ), గిఫ్ట్ సిటీని సందర్శించింది.

నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ విశ్వవిద్యాలయ సందర్శన

ఫోరెన్సిక్ సైన్స్, పరిశోధనలు, సాంకేతికత, ప్రత్యేక శిక్షణను ముందుకు తీసుకెళ్లడంలో విశ్వవిద్యాలయం పోషిస్తున్న పాత్ర గురించి ప్రతినిధుల బృందానికి 'ఎన్ఎఫ్ఎస్‌యూ' వైస్ ఛాన్సలర్ డా. జే.ఎం. వ్యాస్ వివరించారు. ఈ రంగంలో అనుభవాలను పరస్పరం పంచుకోవడంతో పాటు శాస్త్రీయ దర్యాప్తును బలపరచడంలో పెరుగుతున్న ఫోరెన్సిక్ సైన్స్ ప్రాముఖ్యతను ఆయన ప్రధానంగా చెప్పారు.

ఫోరెన్సిక్ సైన్స్‌ను బలోపేతం చేయడానికి, ఆధునిక- శాస్త్రీయ- సాక్ష్యాల ఆధారిత నేర విచారణ వ్యవస్థను తయారుచేయటానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతను డా.జే.ఎం వ్యాస్ ప్రశంసించారు. ఎక్కువ మంది శిక్షణ పొందిన ఫోరెన్సిక్ నిపుణులను తయారుచేసేందుకు దక్షిణాది రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా ఫోరెన్సిక్ విద్య, ప్రత్యేక సంస్థలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

దేశవ్యాప్తంగా ఫోరెన్సిక్ విద్య, సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటకతో సహా పలు రాష్ట్రాల్లో అదనపు ఎన్ఎఫ్ఎస్‌యూ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆయన చెప్పారు.

ఎన్ఎఫ్ఎస్‌యూలోని ప్రత్యేక ఫోరెన్సిక్ ప్రయోగశాలలను మీడియా బృందం సందర్శించింది. ఫోరెన్సిక్ సాంకేతికతలు, మెలకువలపై ప్రత్యక్ష అనుభవాన్ని పొందడంతో పాటు శాస్త్రీయ దర్యాప్తులో వాటి ఉపయోగించటంపై వారు అవగాహన చేసుకున్నారు.

ఈ బృందం ఎన్ఎఫ్ఎస్‌యూ మీడియా సెంటర్, మల్టీ మీడియా ఫోరెన్సిక్ సౌకర్యాలను కూడా సందర్శించింది. మీడియా సాంకేతికతలు, ఆడియో-వీడియో- డిజిటల్ చిత్రాల ఫోరెన్సిక్ విశ్లేషణపై ప్రత్యక్ష అవగాహన తెచ్చుకున్నారు. దర్యాప్తు, నేరాలను గుర్తించడంలో సాంకేతికత, శాస్త్రీయ పద్ధతుల వినియోగం గురించి సంబంధిత నిపుణులు మీడియా ప్రతినిధులకు వివరించారు.

ఆ తర్వాత గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్-సిటీ (గిఫ్ట్ సిటీ)ని సందర్శించిన మీడియా ప్రతినిధుల బృందం.. అక్కడి ఆధునిక మౌలిక సదుపాయాలు, సమీకృత ఆర్థిక- సాంకేతిక వ్యవస్థ గురించి తెలుసుకుంది.

అక్కడ లభించే కీలక రాయితీలు, నియంత్రణ విధానం, మౌలిక సదుపాయాలు, నగర ప్రణాళిక, గ్లోబల్ రీచ్, టెక్నాలజీ ఆధారిత సేవల గురించి గిఫ్ట్ సిటీ ప్రతినిధులు వివరించారు.

మీడియా ప్రతినిధుల బృందం గిఫ్ట్ సిటీలోని భూగర్భ యుటిలిటీ టన్నెల్‌ను కూడా సందర్శించింది. విద్యుత్, ఐసీటీ, నీరు, మురుగునీరు, వ్యర్థాల నిర్వహణ సేవల కోసం ఏర్పాటు చేసిన సమీకృత మౌలిక సదుపాయాల గురించి ప్రత్యక్ష అవగాహన పొందింది. ఈ ఇంటిగ్రేటెడ్ అండర్‌గ్రౌండ్ వ్యవస్థ.. గిఫ్ట్ సిటీకి ఉన్న 'తవ్వకం రహిత (డిగ్గింగ్ ఫ్రీ) నగర భావనకు మద్దతునిస్తూ అత్యవసర సేవలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలు కల్పిస్తుంది.

గిఫ్ట్ సిటీ ఆటోమేటెడ్ వేస్ట్ కలెక్షన్ సిస్టమ్ (ఏడబ్ల్యూసీఎస్) గురించి కూడా మీడియా ప్రతినిధులకు వివరించారు. భారతదేశపు మొట్టమొదటి ఆటోమేటెడ్ వ్యర్థ నిర్వహణ వ్యవస్థగా ఇది గుర్తింపు పొందింది.

అంతర్జాతీయ బ్యాంకింగ్, మూలధన మార్కెట్లు, బీమా, ఫండ్ మేనేజ్‌మెంట్, ఫిన్‌టెక్, ఇతర ఆర్థిక సేవలతో కూడిన గిఫ్ట్ సిటీ సమీకృత వ్యవస్థను, భారతదేశపు అంతర్జాతీయ ఆర్థిక సేవల కేంద్రంగా దాని పాత్రను గిఫ్ట్ సిటీ అధికారులు వివరించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన, ప్రపంచ స్థాయిలో పోటీపడగల భారతదేశాన్ని సాధించాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆకాంక్షకు అనుగుణంగా శాస్త్రీయ సామర్థ్యాలను బలోపేతం చేయడం, నైపుణ్యం కలిగిన మానవ వనరులను అభివృద్ధి చేయడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను నిర్మించడంపై కేంద్ర ప్రభుత్వం పెడుతున్న దృష్టిని ఈ మీడియా పర్యటన తెలియజేస్తోంది.

# గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026లో ఆధార్ ముఖ గుర్తింపు ఎస్‌డీకే, శాండ్‌బాక్స్‌ను ప్రారంభించిన యూఐడీఏఐ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11:గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026లో ఆధార్ ముఖ గుర్తింపు ఎస్‌డీకే (సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కిట్), ఆధార్ ముఖ గుర్తింపు శాండ్‌బాక్స్‌ను భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఈ రోజు ప్రారంభించింది. డిజిటల్ యాప్ లలో ఆధార్ ముఖ గుర్తింపు విధానాన్ని మరింత సులభంగా అనుసంధానించడం, పరీక్షించడం, అమలు చేయడం కోసం ఈ వ్యవస్థ భాగస్వాములకు వీలు కల్పిస్తుంది.

ఆధార్ ముఖ గుర్తింపు ఎస్‌డీకే ద్వారా యూఐడీఏఐ అందించే ముఖ గుర్తింపు సౌకర్యాన్ని నేరుగా ఆండ్రాయిడ్, ఐఓఎస్ యాప్ ల లోనే పొందుపరచుకోవచ్చు. దీనివల్ల వినియోగదారులు వివిధ యాప్ లకు మారాల్సిన అవసరం ఉండదు. ఒకే యాప్ లోనే సులభంగా, నిరంతరాయంగా గుర్తింపు ధ్రువీకరణను పూర్తి చేసుకునే అవకాశం కలుగుతుంది.

వెంటనే వినియోగించుకునేలా రూపొందించిన ఈ ఎస్‌డీకే ద్వారా భాగస్వామ్య సంస్థలకు అనుసంధాన ప్రక్రియ మరింత సులభతరం అవుతుంది. ఇందులో కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ ఆధారిత లైవ్ నెస్, మోసపూరిత ప్రయత్నాలను నిరోధించే సాంకేతికతలు ఉన్నాయి. ధ్రువీకరణ సమాచారాన్ని సురక్షితంగా నిర్వహించడంతో పాటు, గోప్యతకు కూడా ఇది మద్దతు ఇస్తుంది. వినియోగదారుల స్మార్ట్‌ఫోన్లలో పనిచేసేలా ఈ ఎస్‌డీకేను రూపొందించారు. ప్రభుత్వ విభాగాలు, బ్యాంకులు, ఆర్థిక సాంకేతిక సంస్థలు, ఇతర సంస్థలు ముఖ గుర్తింపు ఆధారిత సేవలను మరింత సమర్థవంతంగా అందుబాటులోకి తీసుకురావడానికి ఈ ఎస్‌డీకే సహాయపడుతుందని భావిస్తున్నారు.

ఎస్‌డీకేతో పాటు, యూఐడీఏఐ ప్రారంభిన ఆధార్ ముఖ గుర్తింపు శాండ్‌బాక్స్ భద్రమైన, నియంత్రిత వాతావరణాన్ని అందిస్తుంది. దీని ద్వారా సంస్థలు పూర్తిస్థాయి ఫేస్ అథెంటికేషన్ ప్రక్రియను ప్రత్యక్షంగా (ప్రొడక్షన్ స్థాయిలో ) అందుబాటులోకి తీసుకురావడానికి ముందే దానిని అనుసంధానించుకుని, సమగ్రంగా పరీక్షించి, ధృవీకరించుకోవడానికి వీలవుతుంది.

అదనపు బయోమెట్రిక్ పరికరాలు అవసరం లేకుండా వినియోగదారుల నమోదు, అనుమతి, ముఖ చిత్రీకరణ, లైవ్‌నెస్ తనిఖీలు, గుర్తింపు, లోపాల నిర్వహణ, ఫలితాల అంచనా సహా అన్ని కీలక దశలను పరీక్షించేందుకు డెవలపర్లు, నాణ్యత పరిశీలన బృందాలకు ఈ శాండ్‌బాక్స్ దోహదపడుతుంది. చెల్లని డిజిటల్ సంతకాలు, నెట్‌వర్క్ అంతరాయాలు, సమయ పరిమితి ముగింపు, మోస పూరిత యత్నాలు వంటి వైఫల్య పరిస్థితులను కూడా ముందస్తుగా పరీక్షించుకోవడానికి ఇది అనుమతిస్తుంది.

ఎస్‌డీకే, శాండ్‌బాక్స్ ప్రారంభంతో ఆర్థిక సాంకేతిక, బ్యాంకింగ్ రంగాల చిరకాల డిమాండ్ నెరవేరింది. వినియోగదారుకు బ్యాంకు లేదా ఆర్థిక సాంకేతిక సంస్థ మొబైల్ యాప్ లోనే సులభమైన, సురక్షితమైన నమోదు ప్రక్రియను అందించేందుకు ఇవి వీలు కల్పిస్తాయి.

ఇది వినియోగదారుల నమోదు ప్రక్రియను మరింత సరళతరం చేస్తుంది. ఉదాహరణకు, వినియోగదారు బ్యాంకింగ్, బీమా లేదా బ్రోకింగ్ యాప్ లో ఏదైనా ఒకదాన్ని మాత్రమే డౌన్‌లోడ్ చేసుకుని, ఆ యాప్ నుంచే ఆధార్ ధ్రువీకరణను పూర్తి చేయవచ్చు. గతంలో ఇదే విధమైన ప్రక్రియ కోసం నేపథ్యంలో పనిచేసే ఫేస్ఆర్‌డీ యాప్ అవసరమయ్యేది. దీంతో వినియోగదారుల నమోదు ప్రక్రియ సుదీర్ఘంగా మారడంతో పాటు, ఆధార్ ఫేస్ఆర్‌డీ యాప్ అందుబాటులో ఉండటంపై ఆధారపడాల్సి వచ్చేది. తాజా ప్రారంభంతో ఆధార్ ముఖ గుర్తింపు ధ్రువీకరణ కోసం పలు యాప్ ల అవసరం తగ్గుతుంది.

స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన కృత్రిమ మేధస, యంత్ర అభ్యసన ఆధారిత ముఖ గుర్తింపు విధానాన్ని యూఐడీఏఐ 2021లో ప్రారంభించింది. ఇప్పటివరకు ఈ విధానం ద్వారా 500 కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వాలు, బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, టెలికాం సంస్థలు, బ్రోకరేజ్ సంస్థలు, ధ్రువీకరణ సంస్థలు తదితరాలతో కలిపి దాదాపు 200 సంస్థలు దీనిని స్వీకరించాయి. ఈ సాంకేతికత 2023 సంవత్సరానికి ఆవిష్కరణ విభాగం కింద ప్రధానమంత్రి అత్యుత్తమ పరిపాలన ప్రతిభా పురస్కారాన్ని అందుకుంది.

పెన్షనర్లు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (జీవన్ ప్రమాణ్) సమర్పించడం, ఆయుష్మాన్ భారత్ లబ్ధిదారుల నమోదు, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ పథకాలు, ఆధార్ ఆధారిత చెల్లింపులు, ఈ-కేవైసీ ద్వారా సిమ్ కార్డుల క్రియాశీలకరణ, పీఎం ఈ-డ్రైవ్, పీఎం ఆవాస్ యోజన, పీఎం కిసాన్ వంటి పథకాల లబ్ధిదారుల ధ్రువీకరణ తదితర సేవల్లో ముఖ గుర్తింపు విధానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు.

గుర్తింపు (అథెంటికేషన్) వ్యవస్థలో సులభంగా చేరేందుకు మార్గదర్శకంగా పనిచేసే 'ప్లేబుక్ ఆన్ ఈజ్ ఆఫ్ ఆన్‌బోర్డింగ్' మార్గదర్శక పుస్తకాన్ని కూడా యుఐడిఏఐ ఆవిష్కరించింది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగ సంస్థలు (బిఎఫ్ఎస్ఐ) ( తమ వినియోగదారులు, సిబ్బంది, ఇతర వ్యాపార భాగస్వాముల గుర్తింపు ధ్రువీకరణ కోసం ఇది ఉపయోగపడుతుంది.

## రెండు చిరుత చర్మాలు, సజీవంగా ఉన్న 180 నక్షత్ర తాబేళ్లు, 12 టోకే బల్లులు,
# 24 కిలోల పాంగోలిన్ పొలుసులు, 500 గ్రాముల పులి ఎముకలను స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: వన్యప్రాణుల అక్రమ రవాణాపై నిఘా పెట్టిన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ)... దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గడచిన 10 రోజుల్లో ఆరు కీలక దాడులను చేపట్టింది. ఈ దాడుల్లో రెండు చిరుతపులి చర్మాలు, సజీవంగా ఉన్న 180 భారతదేశ నక్షత్ర తాబేళ్లు, సజీవంగా ఉన్న 12 టోకే బల్లులు, సుమారు 24 కిలోల పాంగోలిన్ పొలుసులు, 500 గ్రాముల పులి ఎముకలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆరు దాడుల్లో మొత్తం పదమూడు మందిని అరెస్టు చేశారు.

నిఘా వర్గాల సమాచారంతో చేపట్టిన దాడుల్లో భాగంగా 07.09.2026న ఒడిశాలోని కోరాపుట్ జిల్లా జేపోరేలో ఒక వ్యక్తిని అడ్డగించి, చిరుత చర్మాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణి (సంరక్షణ) చట్టం-1972లోని ఒకటో షెడ్యూల్ ద్వారా చిరుత పులులకు రక్షణ ఉంది. వీటి చర్మాలు, శరీర భాగాల వంటి వాటిని వాణిజ్యం, అమ్మకం, కొనుగోలు, హస్తగతం చేసుకోవటం, రవాణా చేయటం చట్ట రీత్యా నిషేధం. ఈ చట్టం ప్రకారం చిరుత పులి చర్మాన్ని, పట్టుబడిన వ్యక్తిని తదుపరి దర్యాప్తు కోసం, చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు కోరాపుట్ అటవీ శాఖకు అప్పగించారు.

అదే రోజున జరిగిన మరో తనిఖీలో భాగంగా బెంగళూరులోని గాంధీనగర్ సమీపంలో ఓ వ్యక్తిని డీఆర్ఐ అధికారులు అడ్డగించారు. అతని వద్ద ఉన్న సామాగ్రిని తనిఖీ చేయగా ఆరు సంచుల్లో సజీవంగా ఉన్న 180 భారతదేశ నక్షత్ర తాబేళ్లను గుర్తించారు. ఈ జాతిని వన్యప్రాణి (సంరక్షణ) చట్టం-1972లోని ఒకటో షెడ్యూల్ జాబితాలో ఉన్న జియోకెలోన్ ఎలిగన్స్‌గా వైల్డ్‌లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో (డబ-ల్యూసీబీ) గుర్తించింది. భారతదేశ నక్షత్ర తాబేళ్ల పెంకుపై ఉండే ఆకర్షణీయమైన నక్షత్రం, అరుదైన పెంపుడు జీవి కావడం, వన్యప్రాణుల మార్కెట్లలో డిమాండు ఉండటం వల్ల అంతర్జాతీయంగా వీటి అక్రమ రవాణాకు అవకాశం ఉంటుంది. ఈ చట్టం ద్వారా సజీవంగా ఉన్న 180 తాబేళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశారు.

07.09.2026న జరిగిన మూడో దాడిలో భాగంగా మేఘాలయలోని రి-భోయ్ జిల్లాలో మవ్‌హతి వైపు వెళ్తున్న బొలెరో ట్రక్కును అడ్డగించిన డీఆర్ఐ అధికారులు... తనిఖీలు నిర్వహించారు. వాహనంలోని మూడు బ్యాగుల్లో 14.68 కిలోల పాంగోలిన్ పొలుసులను గుర్తించారు. వన్యప్రాణి (సంరక్షణ) చట్టం-1972లోని ఒకటో షెడ్యూల్‌లో పాంగోలిన్‌లు రక్షిత జాబితాలో ఉన్నాయి. సైట్స్ అపెండిక్స్-ఎ జాబితాలోనూ ఉన్నాయి. ఆసియాలోని పలు ప్రాంతాల్లో సంప్రదాయ వైద్యంలో పాంగోలిన్ పొలుసులను ఉపయోగిస్తారు. ప్రపంచంలోనే అత్యధికంగా అక్రమ రవాణా జరుగుతున్న క్షీరదాల్లో పాంగోలిన్లు ఉన్నాయి. తదుపరి చట్టపరమైన చర్యల కోసం స్వాధీనం చేసుకున్న పొలుసులు, పట్టుబడిన వ్యక్తి, రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని మేఘాలయలోని నొంగ్‌పోహ్ అటవీ రేంజ్ అధికారికి డీఆర్ఐ అప్పగించింది.

అంతకుముందు 2026 సెప్టెంబర్ 5, 6వ తేదీల్లో చిరుత చర్మాన్ని అక్రమంగా రవాణా చేసే వ్యవస్థే లక్ష్యంగా మధ్యప్రదేశ్‌లోని సిద్ధి అటవీశాఖ అధికారులతో కలిసి డీఆర్ఐ అధికారులు, సిద్ధి జిల్లాలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మహీంద్రా థార్ వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరి వద్ద నుంచి ఒక చిరుత చర్మాన్ని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తులు, తనిఖీల ద్వారా ఈ సిండికేట్‌కు చెందిన మరో ఇద్దరిని గుర్తించారు. వారి నుంచి చిరుత చర్మం, అవయువాల అక్రమ వేట, స్వాధీనం, రవాణా, విక్రయానికి సంబంధించిన పలు ఆధారాలను సేకరించారు. చిరుత చర్మాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకుని... వన్యప్రాణి (సంరక్షణ) చట్టం-1972 ద్వారా తదుపరి చర్యల నిమిత్తం పట్టుబడిన వ్యక్తులను సిద్ధి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

వన్యప్రాణుల అక్రమ వాణిజ్యంపై అందిన కచ్చితమైన సమాచారం మేరకు 05.09.2026న అస్సాంలోని కేయోఖాలిలో ఇద్దరు వ్యక్తుల వద్ద సజీవంగా ఉన్న 12 టోకే బల్లులను డీఆర్ఐ అధికా రులు స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణి (సంరక్షణ) చట్టం- 1972లోని ఒకటో షెడ్యూల్, సైట్స్ అపెండిక్స్-ఎఎ జాబితాలో ఈ టోకే బల్లులను చేర్చారు. ఆసియాలోని కొన్ని ప్రాంతాల్లో వీటిని సంప్రదాయ వైద్యం కోసం, శుష్క రూపంలోనూ వాడటం వల్ల అక్రమ రవాణాకు అవకాశం ఏర్పడింది. అరుదైన పెంపుడు జీవిగా కూడా వీటికి డిమాండ్ ఉంది. సజీవంగా ఉన్న బల్లులను స్వాధీనం చేసుకుని, అక్రమ రవాణాకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను, వన్యప్రాణి వస్తువులతో సహా అస్సాంలోని బిశ్వనాథ్ వన్యప్రాణి విభాగం అటవీ రేంజ్ అధికారికి అప్పగించారు.

కర్బి ఆంగ్లాంగ్ జిల్లాలో 28.08.2026న వాహనంలో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులను డీఆర్ఐ అధికారులు అడ్డుకున్నారు. వారి నుంచి దాదాపు 9 కిలోల పాంగోలిన్ పొలుసులు, పుర్రె, పళ్లతో సుమారు 0.5 కేజీ పులి ఎముకలను స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణి (సంరక్షణ) చట్టం-1972 ద్వారా స్వాధీనం చేసుకున్న వన్యప్రాణుల వస్తువులతో సహా వాహనాన్ని, ముగ్గురు వ్యక్తులను అస్సాంలోని బొకొలియా అటవీ రేంజ్ అధికారికి అప్పగించారు.

అంతరించిపోతున్న వన్యప్రాణుల నుంచి జంతువుల చర్మాలు, పాంగోలిన్ పొలుసులు, పులి అవయవాల వరకు వివిధ రకాల వన్యప్రాణుల అక్రమ రవాణా జరుగుతున్నట్లు స్వాధీనం చేసుకున్న వాటి ద్వారా తెలుస్తోంది. దీన్ని బట్టి నిరంతరం అంతర్గత ఏజెన్సీల సమన్వయం అవసరమని స్పష్టం అవుతోంది.

అటవీ శాఖలు, డబ్ల్యూసీసీబీ, ఇతర చట్ట అమలు సంస్థల సహకారంతో, వన్యప్రాణి (సంరక్షణ) చట్టం-1972 ద్వారా, నిఘా వర్గాల సమాచారం ఆధారంగా వన్యప్రాణుల అక్రమ రవాణా వ్యవస్థను డీఆర్ఐ విజయవంతంగా అడ్డుకుంటూ భారతదేశ జీవ వైవిధ్యాన్ని కాపాడుతోంది.

# శ్రీలంక అధ్యక్షునితో కొలంబోలో రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ మర్యాద పూర్వక భేటీ

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 11: శ్రీలంక అధ్యక్షుడు శ్రీ అనురా కుమారా దిసానాయకేతో రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ కొలంబోలో ఈ రోజు సమావేశమయ్యారు. నేతలిద్దరూ రెండు దేశాల సాంప్రదాయిక సౌహార్ద పూర్వక సంబంధాలతో పాటు పరస్పర విశ్వాసం పెనవేసుకున్న బహుముఖీన భాగస్వామ్య అంశాలన్నిటినీ ప్రస్తావిస్తూ ఫలప్రద చర్చల్లో పాల్గొన్నారు.

నాగరికత పరంగా కవలలు, సన్నిహితమైన ఇరుగుపొరుగు దేశాలు, సముద్ర వాణిజ్య భాగస్వాములైన భారత్, శ్రీలంక.. ఈ ప్రాంత భద్రత, స్థిరత్వం, శాంతి, సౌభాగ్యాల్ని నిర్ధారించడంతో పాటే ప్రజల పురోభివృద్ధినీ, సంక్షేమాన్నీ దృష్టిలో పెట్టుకొని కలిసి పనిచేయడాన్ని కొనసాగించనున్నట్లు మరోసారి స్పష్టం చేశాయి. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తరఫున రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ శుభాకాంక్షలను తెలియజేశారు. రెండు దేశాల ప్రజలూ బలమైన చరిత్రాత్మక, నాగరికతపరమైన సంబంధాలతో పాటు పరస్పర సంబంధాలపై ఆధారపడిన ప్రగాఢ మైత్రిని పంచుకుంటున్నారని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.

అధ్యక్షుడు శ్రీ దిసనాయకే రక్షణ మంత్రికి సాదరంగా స్వాగతం పలుకుతూ, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీతో తాను జరిపిన చర్చలను గుర్తుకు తెచ్చుకున్నారు. భారత్ భద్రతకు హాని చేసే కార్యకలాపాలకు శ్రీలంక తన భూభాగాన్ని ఉపయోగించుకోవడానికి ఎన్నడూ అనుమతించదని శ్రీ దిసనాయకే పునరుద్ఘాటించారు. దిత్వా పెనుతుపాను సమయంలో 'ఆపరేషన్ సాగర్ బంధు' పేరిట భారత్ అందించిన ఉపశమన ప్రధాన సహాయానికీ, ద్వీపంలో వివిధ ప్రాంతాల్లో పునర్నిర్మాణ, పునరావాస పనులకు మార్గాన్ని సుగమం చేయడానికి న్యూఢిల్లీ విస్తృత స్థాయిలో సమకూర్చిన పునరావాసపూర్వక సాయానికి అధ్యక్షుడు శ్రీ దిసనా యకే కృతజ్ఞతలు తెలిపారు.

# 52 ట్రాన్స్‌ఫార్మర్ చోరీలు.. అంతర్‌జిల్లా ముఠా అరెస్ట్

### ముగ్గురు నిందితులకు రిమాండ్.. మరో నిందితుడి కోసం గాలింపు
### 30 కిలోల కాపర్ వైర్, వాహనం, చోరీ పరికరాలు స్వాధీనం




కామారెడ్డి, సెప్టెంబర్ 11:(నేటినిజం ప్రతినిధి): కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ కాయిల్స్ చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా సభ్యుల ప్రమేయం 52 ట్రాన్స్‌ఫార్మర్ చోరీలు, ఒక హత్యాయత్నం, రాత్రిపూట ఇంటి దొంగతనం కేసుల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి 30 కిలోల కాపర్ వైర్‌తో పాటు చోరీలకు ఉపయోగించిన వాహనం, పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉండగా.. అతడి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

అసిస్టెంట్ ఇంజనీర్ జాదవ్ బాలాజీ ఫిర్యాదు మేరకు గత ఐదు నెలల్లో భిక్కనూర్ మండలంలోని బస్వాపూర్, భిక్కనూర్, గుర్జకుంట, రామేశ్వరపల్లి, జంగంపల్లి, ర్యాగట్లపల్లి గ్రామాల శివార్లతో పాటు రాజంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 29 ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ కాయిల్స్ చోరీకి గురైనట్లు కేసులు నమోదయ్యాయి. దీంతో భిక్కనూర్, రాజంపేట పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సెప్టెంబర్ 9న రామేశ్వరపల్లి గ్రామ శివారులో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి ప్రయత్నిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులను అడ్డుకున్న అసిస్టెంట్ లైన్‌మెన్ ప్రభాకర్‌పై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన కూడా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై భిక్కనూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

జిల్లా ఎస్పీ ఎం. రాజేష్‌చంద్ర ఆదేశాల మేరకు కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్ పర్యవేక్షణలో భిక్కనూర్ సీఐ జె. నరేష్, సీసీఎస్ సీఐ బి. సంతోష్‌కుమార్, భిక్కనూర్ ఎస్ఐ ఎస్. అనిల్, సీసీఎస్ ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారాన్ని విశ్లేషించిన పోలీసులు నిందితులను గుర్తించారు.

శుక్రవారం భిక్కనూర్ మండల పరిధిలో మరోసారి ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కాయిల్స్ చోరీకి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందడంతో పరివార్ హోటల్ సమీపంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

విచారణలో ఈ ముఠాకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నలుగురు నిందితులు సొంత అన్నదమ్ములని, జల్సాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నట్లు వెల్లడించారు. పగటి సమయంలో లక్ష్య ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి.. రాత్రి వేళల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాలను చోరీ చేసేవారని తెలిపారు. చోరీ చేసిన కాపర్, ఇతర సామగ్రిని విక్రయించి వచ్చిన డబ్బును జల్సాలకు వినియోగించేవారని పేర్కొన్నారు. గతంలోనూ దొంగతనం కేసుల్లో అరెస్టై జైలుకు వెళ్లినప్పటికీ.. విడుదలైన తర్వాత మళ్లీ నేరాలకు పాల్పడినట్లు వెల్లడించారు.

అరెస్టయిన నిందితులను బల్జీర్ సింగ్, రూప్ సింగ్, లకన్ సింగ్‌గా పోలీసులు గుర్తించారు. వీరిపై గతంలో దొంగతనం, రాత్రిపూట ఇంటి దొంగతనం కేసులు కూడా ఉన్నట్లు తెలిపారు. మరో నిందితుడు పరారీలో ఉండగా.. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. నిందితుల నుంచి యమహా ఎఫ్‌జెడ్ ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్, 9 ఆక్సర్ బ్లేడ్లు, కటింగ్ ప్లేయర్, కట్టర్, 9 పానాలు, 10 రింగ్ పానాలు, 3 రాడ్లు, 30 కిలోల కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్‌చంద్ర అభినందించారు.

# “ఆధునిక నిఘంటు నిర్మాణ వైతాళికుడు: రవ్వా శ్రీహరి సాహిత్య ప్రస్థానం”

ఆధునిక తెలుగు భాషా పరిణామ క్రమంలో నిఘంటువు అనేది కేవలం పదాల కూర్పు మాత్రమే కాదు, అది ఒక జాతి చైతన్యానికి, సంస్కృతికి మరియు ఆ భాషా నిర్మాణానికి పటిష్టమైన ఆధారం. భాషా సౌధానికి నిఘంటువు పునాది వంటిదైతే, ఆ పునాదిని శాస్త్రీయ దృక్పథంతో, పరిశోధనాత్మక పటిమతో నిర్మించిన మహనీయుడు మహామహోపాధ్యాయ ఆచార్య రవ్వా శ్రీహరి. తెలంగాణ మట్టిలో పుట్టి, సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాల్లో అసాధారణ పాండిత్యాన్ని గడించి, ఆధునిక తెలుగు నిఘంటు నిర్మాణ శాస్త్రానికి నూతన దిశానిర్దేశం చేసిన ఆయన కృషి తెలుగు సాహిత్య చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించ దగినది. 1943 సెప్టెంబరు 12న నాటి నల్లగొండ జిల్లా, నేటి యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెల్వర్తి గ్రామంలో ఒక సామాన్య చేనేత కుటుంబంలో జన్మించిన శ్రీహరి గారి జీవన ప్రయాణం అత్యంత స్ఫూర్తిదాయకమైనది.

బాల్యంలోనే మాతృ వియోగాన్ని పొంది, అనేక ఆర్థిక సామాజిక ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, విద్య పట్ల ఆయనకున్న అచంచలమైన తపన ఆయనను సరస్వతీ పుత్రుడిగా నిలబెట్టింది. సురవరం ప్రతాపరెడ్డి, ఎం. నరసింగరావుల వంటి మహనీయుల ప్రోత్సాహం, గురువు కప్పగంతుల లక్ష్మణశాస్త్రి మార్గదర్శకత్వం ఆయనలోని పాండిత్యాన్ని సానబెట్టాయి. యాదగిరి లక్ష్మీనృసింహ సంస్కృత విద్యాపీఠంలో ప్రారంభమైన ఆయన విద్యాభ్యాసం, తదనంతరం హైదరాబాద్‌లోని సీతారాంబాగ్ సంస్కృత కళాశాలలో శఠకోప రామానుజాచార్యులు, ఖండవల్లి నరసింహశాస్త్రి వంటి దిగ్గజాల వద్ద మహాభాష్యాంతం వ్యాకరణ శాస్త్ర అధ్యయనంతో పరిపూర్ణమైంది. సంస్కృత వ్యాకరణ సంప్రదాయంపై ఆయనకు ఉన్న అపారమైన పట్టు, తెలుగు పదనిర్మాణ శైలిపై ఉన్న లోతైన అవగాహన ఆయనను ఒక విశిష్ట భాషావేత్తగా తీర్చిదిద్దాయి.

రవ్వా శ్రీహరి పాండిత్యం కేవలం ఒక భాషకు పరిమితం కాలేదు; సంస్కృతం మరియు తెలుగు అనే రెండు ప్రధాన భాషల అంతస్సంబంధాలను ఆయన మౌలికంగా విశ్లేషించారు. సంస్కృతంలోని ధాతువులు, ఉపసర్గలు, విభక్తులు తెలుగు పద నిర్మాణంలో ఏ విధంగా భాగమవుతాయో, వాటి ప్రభావం వల్ల తెలుగు పద సంపద ఎలా రూపాంతరం చెందిందో ఆయన తన నిఘంటు రచనల ద్వారా శాస్త్రీయంగా నిరూపించారు. సాధారణంగా నిఘంటు కర్తలు పదానికి అర్థాన్ని మాత్రమే వివరిస్తారు, కానీ శ్రీహరి ఆ పదము ఏ కాలంలో పుట్టింది, ఏ సందర్భంలో వాడుకలోకి వచ్చింది, కాలక్రమంలో దాని అర్థంలో వచ్చిన మార్పులేమిటి అనే అంశాలను పరిశోధనాత్మకంగా వివరించేవారు. ఆయన నిఘంటువులు జీవంతమైన భాషా పత్రాలుగా వెలుగొందడానికి ప్రధాన కారణం ఆయన అనుసరించిన ఈ చారిత్రక, భాషాశాస్త్ర పద్ధతే.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్య బిరుదురాజు రామరాజు పర్యవేక్షణలో ‘భాస్కర రామాయణం’పై ఆయన చేసిన పరిశోధన తెలుగు సాహిత్య విమర్శలో ఒక మైలురాయిగా నిలిచింది. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సుదీర్ఘకాలం బోధన, పరిశోధనలు నిర్వహించి, ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడిగా అత్యున్నత బాధ్యతలు చేపట్టిన ఆయన, తెలుగు భాషా వికాసానికి వ్యవస్థాగతమైన పునాదులు వేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగంలో ఎడిటర్-ఇన్-ఛార్జ్‌గా ఆయన చేసిన సేవలు ఆధ్యాత్మిక సాహిత్య ప్రచారానికి ఎంతో తోడ్పడ్డాయి.

భాషా శాస్త్రపరమైన దృష్టితో చూస్తే, రవ్వా శ్రీహరి రచనలు శబ్దశాస్త్రం, రూపశాస్త్రం మరియు అర్థశాస్త్రాల సమాహారం. పదాల ఉచ్చారణలో చోటుచేసుకునే మార్పులు, ప్రాంతీయ మాండలిక



సెప్టెంబర్ 12... రవ్వా శ్రీహరి జయంతి

భేదాలు, వివిధ సామాజిక వర్గాల వాడుకలో ఉండే పద సంపదను ఆయన గౌరవించారు. ఆయన నిఘంటువులలో గ్రాంథిక భాషా సౌందర్యం ఎంతటి ప్రాధాన్యం పొందిందో, మాండలిక పదాలూ అంతే గౌరవాన్ని పొందాయి.

ముఖ్యంగా తెలంగాణ మాండలికంలోని నుడికారాలను, పల్లె ప్రజల నోళ్లలో నానిన పదాలను సేకరించి వాటికి శాస్త్రీయ వివరణ ఇవ్వడంలో ఆయన అగ్రగణ్యులు. సంస్కృత ప్రభావం అనివార్యమైన తెలుగు భాషలో, అచ్చతెలుగు లేదా దేశ్య పదాల ఉనికిని కాపాడవలసిన అవసరాన్ని ఆయన గుర్తించారు. అందుకే ఆయన నిఘంటువులు కేవలం పండితులకే కాక, సామాన్య పాఠకులకు, విద్యార్థులకు మరియు ఆధునిక పరిశోధకులకు మార్గదర్శక గ్రంథాలుగా మారాయి. క్లిష్టమైన వ్యాకరణాంశాలను సైతం సరళమైన శైలిలో వివరించడం ఆయన ప్రత్యేకత. ఈ స్పష్టత మరియు సరళత వల్లే ఆయన నిఘంటువులకు విశేషమైన ప్రజాదరణ లభించింది. పండిత ప్రకాండుల ప్రశంసలతో పాటు సామాన్య భాషా ప్రేమికుల ఆదరణను పొందడం అరుదైన విషయం, అది శ్రీహరి గారి విషయంలో సాధ్యమైంది.

ఆధునిక కాలంలో ఆంగ్ల భాషా ప్రభావం పెరిగి, తెలుగు పద సంపద క్రమంగా కనుమరుగవుతున్న నేపథ్యంలో శ్రీహరి కృషి ఒక రక్షణ కవచంలా నిలిచింది. భాషా సంరక్షణ అనేది కేవలం భావోద్వేగ పూరితమైన నినాదం కాకూడదని, అది శాస్త్రీయమైన నిఘంటు నిర్మాణంతోనే సాధ్యమని ఆయన నమ్మారు. ఆయన రూపొందించిన నిఘంటువులు భవిష్యత్ తరాలకు తెలుగు భాషా వారసత్వాన్ని అందించే అక్షర నిధులు. సాహిత్య పరంగా కూడా ఆయన సేవలు ప్రశంసనీయమైనవి; ప్రాచీన కవులు ఉపయోగించిన క్లిష్టమైన పద ప్రయోగాలలోని సౌందర్యాన్ని, భావ వ్యక్తీకరణలోని నైపుణ్యాన్ని విశ్లేషిస్తూ ఆయన రాసిన వ్యాసాలు సాహిత్య విమర్శకు కొత్త ఊపిరిని పోశాయి. భాషా శాస్త్రం మరియు సాహిత్యం అనే రెండు విభాగాలను సమన్వయ పరచడం ద్వారా ఆయన ఒక సమగ్ర పండితుడిగా గుర్తింపు పొందారు. కేవలం పదాల అర్థాలు సేకరించడమే కాకుండా, వాటి వెనుక ఉన్న సంస్కృతిని, చరిత్రను వెలికితీయడం ఆయన పరిశోధనలోని వైశిష్ట్యం. 2023 ఏప్రిల్ 21న ఆయన భౌతికంగా మనకు దూరమైనా, ఆయన నిర్మించిన నిఘంటు సామ్రాజ్యం తెలుగు భాష ఉన్నంత కాలం సజీవంగానే ఉంటుంది.

నిజానికి రవ్వా శ్రీహరి ఒక నిఘంటుకర్త మాత్రమే కాదు, ఆయన ఒక భాషా విప్లవకారుడు. సంప్రదాయాన్ని గౌరవిస్తూనే ఆధునికతను ఆహ్వానించిన సమన్వయకర్త. ఆయన జీవితం నేటి తరం పరిశోధకులకు ఒక పాఠం. ఒక సామాన్య నేపథ్యం నుండి వచ్చి, కేవలం తన మేధస్సుతో, కఠోర శ్రమతో మహామహోపాధ్యాయుడిగా ఎదగడం సామాన్యమైన విషయం కాదు. ఆయన నిఘంటువుల్లోని ప్రతి అక్షరం తెలుగు భాషా పరిరక్షణ పట్ల ఆయనకున్న అంకిత భావాన్ని చాటుతుంది. భాషా వికాసమంటే కేవలం కొత్త పదాలను సృష్టించడం కాదు, ఉన్న పద సంపదను పదిల పరుచుకుంటూ, మారుతున్న సామాజిక అవసరాలకు అనుగుణంగా భాషను మలచుకోవడమని ఆయన నిరూపించారు. తెలుగు భాషాభిమానులు, సాహిత్యకారులు, పరిశోధకులు ఎవరైనా సరే శ్రీహరి రచనలను ఆశ్రయించకుండా తెలుగు భాషాధ్యయనాన్ని పరిపూర్ణం చేయలేరు. అటువంటి మహోన్నత భాషావేత్త కృషీవలత్వాన్ని స్మరించుకోవడం మనందరి బాధ్యత. ఆధునిక తెలుగు నిఘంటు నిర్మాణానికి శాస్త్రీయ పునాది వేసిన ఈ మహనీయుడి సేవలు చిరస్మరణీయమైనవి. భాషా చైతన్యం ఉన్నంత కాలం, తెలుగు పదం వెలుగుతున్నంత కాం రవ్వా శ్రీహరి గారి పేరు నిఘంటువులలో సజీవంగా ప్రకాశిస్తూనే ఉంటుంది. తెలుగు జాతి గర్వించదగ్గ ఈ భాషా తపస్వి సేవలను గౌరవించడం అంటే మన భాషను మనం గౌరవించుకోవడమే. ఆయన అందించిన స్ఫూర్తితో తెలుగు భాషా వికాసానికి మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది. తెలుగు పదాల పొదరిల్లులో ఆయనొక అక్షర శిఖరం. ఆ శిఖరపు వెలుగులో తెలుగు భాషా ప్రయాణం నిరంతరాయంగా సాగుతూనే ఉండాలి.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

---

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న

### ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్

### ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలి



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 11:(నేటినిజం ప్రతినిధి): నగర ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. నగరంలోని 48వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ కర్రె పద్మ అనిల్ ఆధ్వర్యంలో, అపోలో రీచ్ హాస్పిటల్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నగరంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని మేయర్ తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్యులు ముందుకు వచ్చి మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు ప్రజలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు మరియు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గాజ రమా శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, నాయకులు ఉప్పరపల్లి శ్రీనివాస్, పర్వతం మల్లేశం, అపోలో రీచ్ హాస్పిటల్ సిబ్బంది, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

---

## గ్రామపంచాయతీల అభివృద్ధికి మరో ముందడుగు

ములుగు, సెప్టెంబర్ 11:(నేటినిజం ప్రతినిధి): ఈరోజు ములుగు జిల్లా కేంద్రం లోని గాంధీ పార్క్ వద్ద గ్రామపంచాయతీల జనరల్ ఫండ్‌ను ఎస్‌టిఓ(ట్రెజరీ) ద్వారా వెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా డ్రా చేసుకునే అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క చిత్రపటాలకు ములుగు జిల్లా సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించడం జరిగింది.

ములుగు జిల్లా సర్పంచుల ఫోరం కన్వీనర్ ముష్నేపల్లి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, గ్రామ యతీల అభివృద్ధికి కీలకమైన నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రి సీతక్క కి సర్పంచుల ఫోరం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ గౌడ్ మాట్లాడుతూగతంలో జనరల్ ఫండ్‌ను వినియోగించుకోవడానికి ఎస్టీఓ ద్వారా వెళ్లాల్సి రావడంతో ప్రక్రియ ఆలస్యం అయ్యేది. దీంతో గ్రామాల్లో అత్యవసరమైన పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, అభివృద్ధి పనులు సకాలంలో చేపట్టేందుకు ఇబ్బందులు ఎదురయ్యేవి.

ప్రస్తుతం గ్రామపంచాయతీల అవసరాలకు అనుగుణంగా నిధులను వేగంగా, సకాలంలో వినియోగించుకునే అవకాశం కల్పించడం ఎంతో కీలకమైన నిర్ణయం. ఇది గ్రామీణ అభివృద్ధికి వేగం తీసుకురావడంతో పాటు సర్పంచులకు పరిపాలనా పరంగా మరింత వెసులుబాటు కల్పిస్తుంది. సర్పంచుల సమస్యలను గుర్తించి, గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కి, మంత్రి శ్రీమతి సీతక్క కి ములుగు జిల్లా సర్పంచుల ఫోరం తరఫున హృదయ పూర్వక ధన్యవాదాలు.”ఈ కార్యక్రమంలో దేవగిరి పట్నం సర్పంచ్ ధరావత్ పూలమ్మ సర్వాపూర్ సర్పంచ్ ఇక కుమార్ అంకన్న గూడెం సర్పంచ్ రాజు , కొత్తూరు సర్పంచ్ గట్టు సుదర్శన్ బంజరుపల్లి సర్పంచ్ రఘు మదనపల్లి సర్పంచ్ కరుణా సాగర్ పత్తిపల్లి సర్పంచ్ జగ్గన్నపేట సర్పంచ్ సారయ్య తదితర కృతజ్ఞతలు తెలియజేశారు.

---

## సెప్టెంబర్ 17తెలంగాణ విమోచన దినోత్సవంను అధికారికంగా నిర్వహించాలి

### విమోచన దినోత్సవం నిర్వహణపై కాంగ్రెస్ కు చిత్తశుద్ధి లేదు.

### కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవం పేరిట రాజకీయాలు చేస్తుందిబీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 11:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ప్రజలకు నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కల్పించేందుకు సాగిన చారిత్రక పోరాటం, తెలంగాణకు అసలైన స్వాతంత్రం లభించిన సెప్టెంబర్ 17 ను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించే పరిస్థితుల్లో లేదని, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాల్సిన కాంగ్రెస్ సర్కార్ , ప్రజా పాలన దినోత్సవం పేరిట రాజకీయాలు చేయడం మానుకొని, అధికారికంగా విమోచన దినోత్సవం నిర్వహించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మాన కొండూరు మండల కేంద్రంలో జరిగిన నియోజకవర్గస్థాయి మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి పై వ్యాఖ్యలు చేశారు. భారతదేశ సమైక్యత కోసం ఉక్కు సంకల్పంతో కృషి చేసిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ నాయకత్వంలో చేపట్టిన చర్యల ఫలితంగా హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని గుర్తు చేశారు. తెలంగాణ విముక్తి కోసం రజాకార్ల దౌర్జన్యాలకు ఎదురొడ్డి, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వేలాది మంది వీరుల త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావు తదితరుల నాయకత్వంలో పోరాడిన కార్యకర్తలు, గ్రామీణ ప్రాంతాల్లో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన సామాన్య ప్రజలు తెలంగాణ విమోచన చరిత్రలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. మహనీయుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, సెప్టెంబర్ 17ను ‘ప్రజా పాలన దినోత్సవం’ కాకుండా అధికారికంగా ‘తెలంగాణ విమోచన దినోత్సవం’గా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విమోచన చరిత్రను మరుగునపరిచే ప్రయత్నాలను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని, ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రంగు భాస్కరాచారి, మానకొండూరు మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి, తిమ్మాపూర్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి చారి, సెన్సార్ ఫిలిం బోర్డ్ మెంబర్ రాపాక ప్రవీణ్, జిల్లా నాయకులు అప్పని తిరుపతి, బొగ్గుల రమేష్, బూట్ల శ్రీనివాస్, దూలం కిరణ్ గౌడ్, మియాపురం లక్ష్మణచారి, కత్తి ప్రభాకర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి భాషబోయిన ప్రదీప్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు మీసా రమణయ్య, తిమ్మాపూర్ బీజేవైఎం మండల అధ్యక్షులు అరుణ్, బీజేవైఎం నాయకులు మర్రి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

---

## తెలంగాణ సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవంగా ప్రభుత్వం నిర్వహించాలి

### ములుగు జిల్లా కలెక్టర్ శ్రీ బోర్కాడే హేమంత్ సహదేవరావు కి భారతీయ జనతాపార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం వినతి



ములుగు, సెప్టెంబర్ 11:(నేటినిజం ప్రతినిధి): సెప్టెంబర్ 17ను అధికారికంగా ××“తెలంగాణ విమోచన దినోత్సవం”××గా నిర్వహించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు శుక్రవారం ములుగు జిల్లా కలెక్టర్ శ్రీ బోర్కాడే హేమంత్ సహదేవరావు గారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మాట్లాడుతూ, 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో అత్యంత కీలకమైన చారిత్రక ఘట్టమని, నిజాం పాలన నుంచి హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన ఈ రోజును తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని కోరారు.

తెలంగాణ విమోచన కోసం పోరాడిన రైతులు, మహిళలు, యువకులు, సామాన్య ప్రజలు మరియు అమరవీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

తెలంగాణ విమోచన చరిత్రను శాశ్వతంగా పరిరక్షించేందుకు “తెలంగాణ సప్త సంకల్పాలు” అమలు చేయాలని వారు కోరారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడంతో పాటు, సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు “స్టాట్యూ ఆఫ్ లిబరేషన్ ? తెలంగాణ” నిర్మాణం, హైదరాబాద్‌లో తెలంగాణ విమోచన మ్యూజియం ఏర్పాటు, ప్రతి జిల్లా కేంద్రంలో విమోచన స్మృతి కేంద్రాల ఏర్పాటు, పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ విమోచన చరిత్రను చేర్చడం, చారిత్రక ప్రాంతాల్లో స్మారక స్తూపాల నిర్మాణం, తెలంగాణ విమోచన పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి వంటి అంశాలను ప్రభుత్వం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ శ్రీ బోర్కాడే హేమంత్ సహదేవరావు గారికి వినతిపత్రం అందజేసిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీలమంతుల రవీంద్రచారి, నగరపు రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్ రావు, జిల్లా కోశాధికారి గంగిశెట్టి రాజ్‌కుమార్, ములుగు మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు, గాదం కుమార్, ఎల్కతుర్తి శ్రీహరి, యాద సంపత్, లకావత్ రాజ్‌కుమార్, వేడుదుల మమన్,యాటసాగర్,వేల్పుకొండ రఘువీర్, శిరీష్, తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.




Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.